ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 4 సెప్టెంబరు 2024





కొల్లూరు : వరద నీటిలో ఉన్న పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాల ఏరియల్ వ్యూ

శాంతించిన కృష్ణమ్మ

తగ్గుముఖం పడుతున్న ఉధృతి



సోమవారం అర్ధరాత్రి కరకట్టను పరిశీలిస్తున్న రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తదితరులు



కొల్లూరు కరకట్ట వద్ద పడవల ద్వారా మంచినీరు, ఆహార పొట్లాల సరఫరాను పరిశీలిస్తున్న మంత్రులు, అనగాని, గొట్టిపాటి కలెక్టర్, వెంకట మురళి, ఎంపీ కృష్ణప్రసాద్ ఎమ్మెల్యే ఆనందబాబు



పెనుమూడి శిబిరంలో ఉన్న మహిళలతో మాట్లాడుతున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

మహోగ్రంగా ముంచుకొస్తోన్న కృష్ణమ్మ శాంతించింది. వర్షాలకు తోడు, పొంగి పొర్లుతున్న వాగులతో నిండుగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఉధృతి మంగళవారం మధ్యాహ్నం కొంతమేర తగ్గింది. నాగార్జున సాగర్ జలాశయం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రికి సగానికి సగం పడిపోయింది. వరద ప్రవాహం సుమారు 2 లక్షల క్యూసెక్కులకుపైగా తగ్గింది. దీంతో నదీ పరివాహక గ్రామాలు, ప్రకాశం బ్యారేజి దిగువ లంకల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే పరిస్థితులు కొలిక్కి వస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల నుంచి బాధితులు ఇప్పుడిప్పుడే తెరుకుంటున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు కరకట్ట వెంబడి జాగ్రత్తలు తీసుకుంటూ ఎక్కడా గండి పడకుండా, లీకులు సంభవించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఇదే సమయంలో వరద ఉధృతి తగ్గడం.. బుధవారానికి ప్రవాహం ఇంకా తగ్గవచ్చన్న జలవనరుల శాఖ అంచనా నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల్లో టెన్షన్ తగ్గింది. లంకల్లో ఒక్క రోజులోనే మూడు అడుగుల మేర నీరు తగ్గుముఖం పట్టింది. కలిసి నడిచిన అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, చేయిచేయి కలిపిన గ్రామస్థుల కారణంగా పెనుగండం తప్పిందని భావించారు. అయితే ప్రవాహం తగ్గడంతో ఇప్పడిప్పుడే నష్ట పరిణామాలు వెలుగుచూస్తున్నాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాల్సి ఉంది. ప్రజలు తేరుకుంటున్నా వరద కారణంగా ఇళ్లు, పశుపక్షాదులు, పంటలకు జరిగిన నష్టంపై ఆందోళన చెందుతున్నారు.

- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు
- వెలుగు చూస్తోన్న 'కన్నీటి' కష్టాలు
- కరకట్టకు గండ్లు, లీకులపై తొలుత ఆందోళన
- కలిసొచ్చిన సమన్వయం.. చర్యలతో తప్పిన గండం
- అర్ధరాత్రి దాటాక కరకట్టలను పరిశీలించిన మంత్రులు
- బ్యారేజి దిగువున ముంపులోనే లంకలు.. అల్లాడుతున్న ప్రజలు

తెనాలి, బాపట్ల, నరసరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఎప్పుడు కరకట్టను కోసేస్తుందోనని.. ఎక్కడ గండిపడుతుందోనని.. ఎప్పుడు ఏ ఊరిపై వరద ప్రవాహం పడుతుందోనని బిక్కు బిక్కుమంటూ ఉన్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎప్పుడు.. ఎక్కడ.. ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన చెందినా ఆ పరిస్థితి లేకుండా పోయింది. పట్టపగ్గాలు లేకుండా.. ప్రవాహ ఉధృతితో పరుగులు పెడుతున్న కృష్ణమ్మ శాంతించింది. మంగళవారం నాగార్జున సాగర్ జలాశయం వద్ద వరద తగ్గుముఖం పట్టింది. దీంతో అటు ప్రజలు, ఇటు అధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ఉపిరి పీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ప్రమాదకర పరిస్థితుల నుంచి బాధితులు తెరుకుంటున్నారు. నదీ తీరం వైపు వెళ్లకుండా ఎక్కడికక్కడ పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారానికి వరద ప్రవాహం ఇంకా తగ్గవచ్చని అంచనా. సోమవారం వరకు 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తే, అదే రోజు రాత్రి నుంచి వరద ఉధృతి తగ్గుతూ వస్తోంది. ప్రకాశం బ్యారేజి దగ్గర మంగళవారానికి 6.74 లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం తగ్గింది. అటు పులిచింతల నుంచి కూడా మంగళవారం సాయంత్రం వరకు 4.20 లక్షల వరకు వరద నీటిని బ్యారేజికి విడుదల చేసినా, దానిని కూడా 3.87 లక్షల క్యూసెక్కులకు తగ్గించారు. అటు మునేరు, పాలేరు, కీసర వంటి వాగుల నుంచి కూడా వరద తగ్గిపోయింది. వర్షాలు కూడా లేకపోవడంతో వాగుల నుంచి ప్రస్తుతం లక్ష క్యూసెక్కుల లోపే వరద నీరు బ్యారేజికి చేరుతోంది. బుధవారానికి వరద మరింత తగ్గిపోతుందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని అధికారులు చెప్తున్నారు. అమరావతి, అచ్చంపేట, రెంటచింతల మండలాల్లోని లంక గ్రామాల్లో పరిస్థితులు ఇప్పుడిప్పుడే అదుపులోకి వస్తున్నాయి. లంక గ్రామాల్లో ముంపు అంత వేగంగా తగ్గడంలేదు. ప్రకాశం బ్యారేజి దిగువున తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కరకట్టకు లోపల ఉన్న ఊళ్లన్నీ వరద ముంపులోనే ఉన్నాయి. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లోని ఇళ్ల నాలుగు రోజులుగా నీటిలో నానిపోయి ఉన్నాయి. ఏ ఇల్లు ఎప్పుడు కూలుతుందోనని పాత ఇళ్ల వారు భయపడుతున్నారు. ఇప్పుడిప్పుడే ముంపు నుంచి కొన్ని గ్రామాలు, లంకలు, అందులోని ఇళ్లు బయటపడుతున్నా నీరు బయటకు పోయిన తర్వాత మట్టి కూడా పేరుకుని, దానిని శుభ్రం చేసుకోవడం కష్టతరమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆయా మండలాల పరిధిలో చాలాచోట్ల ఇంకా రహదారులు బయటపడలేదు. పలు ప్రాంతాల్లో ఇంకా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో విష సర్పాలు, దోమలతో ప్రజలు అల్లాడుతున్నారు. నీటిలో మూడు రోజులుగా చిక్కుకుపోయిన గ్రామాల వారికి అధికారులు ఆహారం, తాగునీటి డబ్బాలను మంగళవారం కూడా సరఫరా చేశారు. అయితే ఇవి అందరికీ సక్రమంగా చేరడంలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. జనం పరిస్థితి ఇలా ఉంటే.. మూగజీవాల కష్టాలు వర్ణనాతీతమే. వరద ఉధృతికి చాలా ఊళ్లలోని వాములు కొట్టుకుపోయాయి. మంగళవారం కూడా రోడ్లపైనా నీరు ప్రవహిస్తుండడంతో ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు రాలేకపోయారు. పశువులను మెరకల్లో కట్టేసే పరిస్థితిలేదు. వరదల కారణంగా గుంటూరు జిల్లాలోని 11 మండలాలు వరద, వర్ష ప్రవాహానికి గురికాగా 75,153 మంది ప్రజలు ఇబ్బందులు పడగా 35,345.2 హెక్టార్లలో నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.



కొల్లిపర: బొమ్మువానిపాలెం దగ్గర పడవపై గ్రామం నుంచి బయటకు వస్తున్న బాధితులు



కొల్లూరు : వరద ఉధృతికి వాలిపోయిన అరటి తోట

లీకులు.. పోటుతోఆందోళన..

కరకట్టలకు సమాంతరంగా సాగుతున్న నీటి ప్రవాహం ఓ వైపు.. లీకులతో నీటి చెమ్మలు కరకట్టలపైకి ఎగతన్నడం.. లీకుల గుర్తింపు.. మరోవైపు అమావాస్య ప్రభావంతో సముద్రంలో పోటుతో.. ఎప్పటికి వరద ముంపు తగ్గుతుందోనని ప్రజల నుంచి ప్రజాప్రతినిధులు వరకు కలవరపడ్డారు. కట్టలకు గండిపడే అవకాశం ఉంది అప్రమత్తంగా ఉండాలనే ముందస్తు హెచ్చరికలు.. గంటగంటకు పెరుగుతున్న నీటి ప్రవాహం నేపథ్యంలో కరకట్టలకు తాత్కాలిక మరమ్మతులతో ముప్పు తప్పింది. ఈ కృతువులో ఆయా గ్రామాల ప్రజలు, అధికారు లు రాత్రి పగలు అన్న తేడా లేకుండా భాగస్వాములయ్యారు. రేపల్లె ప్రాంతంలో 2009 నాటి పరిణామాలు సంభవించే ప్రమాదం ఉందన్న ఆందోళన నెలకొన్నా.. ముప్పు తప్పేలా అందరూ కలిసికట్టుగా జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటే వరకు కూడా కరకట్టల వద్దే అధికారులు ఉండగా మంత్రులు అనగాని, సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కరకట్టల పరిస్థితిని పరిశీలించారు. బ్యారేజీ ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో అధికారులతో పాటు ప్రజలు పెనుగండం తప్పినట్లైందని ఊపిరి పీల్చుకున్నారు. రావి అనంతవరం, పెదపులివర్రు తదితర ప్రాంతాల వద్ద లీకులను గుర్తించిన వెంటనే పూడ్చేశారు. రైతుల సహకారం తీసుకుని, అధికారులను సమన్వయ పరిచి ఇసుక బస్తాలు, కంకరను తరలించి కరకట్టను ఎక్కడికక్కడ తాత్కాలికంగా పటిష్ఠ పరిచే పనులను చేపట్టడంతో గండం గట్టెక్కారు.



తాగునీరు కోసం పై అంతస్తులో నిలబడి ఎదురుచూస్తున్న తిప్పలకట్ట గ్రామస్థులు

మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి

వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో రేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మంత్రులు, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ దూడీ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో సమీక్షించారు. అధి కారులు సకాలంలో స్పందించి కృషి చేయడం వల్లే ఎక్కడా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరో 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదిలో వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. వరద ఉధృతికి కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి కరకట్ట బలోపేతానికి కృషి చేయాలన్నారు. లంక గ్రామాల్లో 1000 మంది లైన్‌మన్లను పంపించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. బురద, చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని బాపట్ల కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న 24 గ్రామాల్లోని 24 వేల మందికిపైగా జనం ఇబ్బందులు పడకుండా జనరేటర్లు, విద్యుత్ దీపాలు, ఆహార పదార్థాలు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. నాలుగు చోట్ల కరకట్ట బలహీనపడి లీక్ అవుతున్నా గ్రామస్తుల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన నివారించగలిగామన్నారు. రేపల్లె మండలం పెనుమూడిలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మంత్రులు సందర్శించి బాధితులకు అందుతున్న సేవల గురించి ఆరా తీసి అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం అర్ధరాత్రి కరకట్టను పరిశీలించి బలహీనంగా ఉన్న ప్రాంతాలను ఇసుకగోతాలతో పటిష్ఠం చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు.

బాధితులకు అండగా ఉంటాం ● మంత్రి మనోహర్

వరద బాధితులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొల్లిపర మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి ముంపు గ్రామాల్లో మూడో రోజు కొనసాగుతున్న సహాయక చర్యలను పరిశీలించారు. కరకట్ట కోతలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు తెలిపారు. ప్రవాహం తగ్గే వరకు కరకట్టను పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. నదికి వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలకు అండగా ఉంటామన్నారు. వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బి.రాజశేఖర్ కొల్లిపర మండలం అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, దంతలూరు, అత్తోట గ్రామాల్లోని పంటలను డైరెక్టర్ ఢిల్లీరావు, శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు.



కొల్లూరు కరకట్ట దిగువున తగ్గిన వరద ఉధృతి



రేపల్లె : పల్లెపాలెంలో తగ్గిన వరద ఉధృతి



కొల్లూరు: పోతార్లంకలో నీట మునిగిన విష్ణాలయం

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

● అవార్డు గ్రహీతలకు రేపు బాపట్లలో పురస్కారాలు

బాపట్ల, సెప్టెంబరు 3: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్త మ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారి జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణ రావు మంగళ వారం ప్రకటించారు. గురువారం ఉదయం బాపట్లలోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో జరిగే వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి, సత్కరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన 15 మంది వివరాలు.. బీ బధిరిరెడ్డి(అక్కాయపాలెం హైస్కూల్, వేట పాలెం మండలం), పి.సాంబశివరావు(ప్యాపర్రు హైస్కూల్ అమర్తలూరు మండలం), కె.పద్మావతి (కుంకులమర్రు హైస్కూల్, కారం చేడు మండలం), ఇ.శామ్యూల్ (బాపట్ల మున్సిపల్ హైస్కూల్), పి.పూర్ణచంద్ర రావు(జాండ్రపేట గవర్నమెంట్ హైస్కూల్, చీరాల), పి.జ్యోతినిర్మల(చక్రాయపాలెం హైస్కూ ల్ అద్దంకి మండలం), పివి.రామారావు (బాలికల ఉన్నత పాఠశాల, వేటపాలెం), కె.రామయ్య(రాజీవ్‌నగర్ కాలనీ స్కూల్, అద్దంకి మండలం), టి.పద్మావతి (బాలవారిపాలెం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నిజాంపట్టణం మండలం), ఎం.ధనలక్ష్మి (ఎంపీయూ పీఎస్, సివిస్ట్రీట్ అద్దంకి మండలం), ఎస్.నరసింహారెడ్డి(ఎం పీపీ ఎస్ స్వర్ణపాలెం, కారంచేడు మండలం), పి.శ్రీనివాసరావు (ఎంపీ పీఎస్ కుంకులమర్రు, కారంచేడు మండలం), జి.శ్రీనివాసరావు(ఎంపీయూపీఎస్ చెన్నుపల్లి, బల్లికురవ మండలం), షేక్.జాన్‌బాషా(ఎంపీపీఎస్, ద్రోణాదుల మార్టూరు మండలం), ఎ.ఉమామహేశ్వరరావు (బాపట్ల, ఏవీవీ స్కూల్, డ్రాయింగ్ మాస్టర్)లను ఎంపిక చేశారు. వీరంతా 5వ తేది ఉదయం కల్యాణ మండలంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఈవో సూచించారు.

మిర్చి యార్డులో.. కలకలం

- సెక్రటరి, సిబ్బందితో బృందం భేటీ
- చెక్‌లిస్టు ప్రకారం ఫైళ్లు కావాలని ఆదేశాలు
- త్వరలో అవినీతి, అక్రమాలు నిగ్గు తేలే అవకాశం
- అప్పటి పాలకులు, అధికారుల గుండెల్లో గుబులు
- కమీషన్ వ్యాపారుల వాంగ్మూలాల నమోదుకు చర్యలు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలకు రావడం కలకలం సృష్టించింది. ఆంధ్రజ్యోతి ముందే చెప్పిన విధం గా మంగళవారం ఉదయం ప్రాంతీయ నిఘా కార్యాలయం అధి కారులు యార్డు పరిపాలన భవనానికి చేరుకుని సెక్రెటరి ఐ వెంకటేశ్వరరెడ్డితో భేటీ అయ్యారు. తొలుత యార్డు కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 2014-19 మధ్య జరిగిన వ్యవహారాలకు సంబంధించి తమకు ఫైళ్లు, డాక్యుమెంట్లు అందజేయాలని ఒక చెక్‌లిస్టును అందజేశారు. ఉదయం, మధ్యాహ్నం కూడా విజిలెన్స్ అధికారులు మిర్చియార్డులోనే ఉండి సమగ్రంగా వివరాలు సేకరించడం ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ దృష్టి సారించిందన్న సమాచారం యార్డు వర్గాల్లో మంగళవారం అంతా చర్చనీయాంశంగా మారింది. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఇటీవలే విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్‌గుప్తాని కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై డీజీ విచారణకు ఆదేశించడంతో ప్రాంతీయ కార్యాలయం సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దార్ కే నాగమల్లేశ్వరరావు, మరో ముగ్గురు సిబ్బందితో ఒక టీమ్‌ని నియమించారు. ఆ మేరకు విజిలెన్స్ బృందం తొలుత యార్డు పరిపాలన భవనానికి చేరుకుని తమ విచారణని ప్రారంభించింది. 2019 జూన్, జూలై, ఆగస్టులో 5 లక్షల మిర్చి టిక్కీలను ఈ-నామ్‌లో నమోదు చేయలేదు. వీటి విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. అప్పట్లో ఆరోపణలు రాగా దీనిపై మొక్కుబడి విచారణ జరిపి ఏ ఒక్క అధికారిపై చర్యలు తీసుకోకుండా మూసేశారని విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారంలో అప్పటి సెక్రెటరితో పాటు 10 మంది సూపర్‌వైజర్ల పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు కోరారు. ప్రధానంగా 2023లో కేవలం రెండు నెలల వ్యవధిలో జరిగిన కమీషన్ వ్యాపారుల 400 రెన్యువల్స్, 180 వరకు జరిగిన పార్టనర్‌షిప్ డీడ్‌లకు సంబంధించి భారీగా నగదు చేతులు మారినట్లు విజిలెన్స్‌కు ఫిర్యాదు అందడంతో దీనికి సంబంధించిన ఫైళ్లను తమకు పంపాలని ఆదేశించారు. కమీషన్, ఎక్స్‌పోర్టు లైసెన్సులు ఏ విధంగా ఇస్తారు. వాటి విధివిధానాలను తెలియజేయాలని కోరారు. అలానే యార్డులో వేమెన్ల వ్యవస్థ గురించి, మచ్చుకాయల మాఫియా గురించి వాకబు చేశారు. యార్డులో గేట్ల వద్ద ఏర్పాటు చేసిన వేబ్రిడ్జీలలో ఒక్కటి కూడా పని చేయకపోవడంపై ఆశ్చర్యానికి గురయ్యారు. యార్డులోకి వచ్చే సరుకుకు సక్రమంగా అకౌంటబిలిటీ లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నదని గుర్తించారు. లైసెన్సులను వేరే వ్యక్తులకు లీజుకు ఇవ్వడం వంటి వివరాలు కూడా వివిధ వర్గాల నుంచి సేకరించారు. జీఎస్టీ రూపంలో ఆదాయానికి పడిన గండి గురించి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ తాము ఫైళ్లన్నింటిని తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలించి ఆ తర్వాత వ్యాపారులు, ఉద్యోగుల వాంగ్మూలాలు నమోదు చేస్తామన్నారు. చివరిగా అవినీతి, అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు.



మిర్చియార్డులో తనిఖీలకు వచ్చిన విజిలెన్స్ అధికారులు

నిట్ ఆంధ్రలో పీహెచ్‌డీ



పశ్చిమగోదావరి జిల్లా-తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆంధ్ర)- విశ్వేశ్వరాయ స్కీమ్ కింద పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో 5 సీట్లు, పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో 2 సీట్లు ఉన్నాయి. రిటెన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

అర్హత: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అభ్యర్థులు ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. గేట్/నెట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లు/అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్‌లు/ఇండస్ట్రీలలో కనీసం రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.

ఫెలోషిప్: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి మూడేళ్లు నెలకు రూ.43,750లు ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **ఈ-మెయిల్:** hdadmissions@nitandhra.ac.in
- **వెబ్‌సైట్:** www.nitandhra.ac.in

దిక్సూచి DIKSUCHI

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'బీటెక్ & బీఎస్+ఎంఎస్' ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిని అనుసరిస్తారు.

జేఎన్‌టీయూఏలో ఐసీపీ సెకండ్ ఫేజ్

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. అభ్యర్థులు మొదటి మూడేళ్లు అనంతపురం జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగేళ్ల కోర్సు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. సీఎస్ఈ, ఈసీఈ విభాగాలు ఎంచుకోవచ్చు.

- సీఎస్ఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(సీఎస్ఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(కంప్యూటర్ సైన్స్), ఎంఎస్(కంప్యూటర్ సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్-ఏఐ&ఎంఎల్) చదవాల్సి ఉంటుంది.
- ఈసీఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(ఈసీఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), ఎంఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-మెషిన్ లెర్నింగ్, సెన్సార్స్ అండ్ సిస్టమ్స్) చదవాలి.

మిగిలిన సీట్ల వివరాలు: కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ)లో 7 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)లో 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఉండాలి.



- **సెకండ్ ఫేజ్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ISTS2

SCHOLARSHIP ALERT

Nikon Scholarship Program

Description: An initiative of Nikon India Private Limited to financially support students from disadvantaged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income (from all sources) should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1,00,000

Last Date to Apply: 20-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/NIKON12

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zqexLBVలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



20 నుంచి అక్కినేని చలనచిత్రోత్సవం

లెజండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఆయన చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ (ఎఫ్.హెచ్.ఎఫ్) ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్కినేని కుటుంబ సభ్యుల సహకారంతో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్, పీవీఆర్ ఐనాక్స్ లతో కలసి 'ఏయన్నార్ 100- కింగ్ ఆఫ్ ద సిల్వర్‌స్క్రీన్' పేరుతో ఈ చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ మేకర్, ఎఫ్.హెచ్.ఐ. డైరెక్టర్ శివేంద్ర సింగ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన అక్కినేని అద్భుత చిత్రాలు పదింటిని హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాలతో సహా 25 ప్రాంతాల్లో ప్రదర్శిస్తామని ఆయన వెల్లడించారు. ఇంతకుముందు అమితాబ్ బచ్చన్, దిలీప్‌కుమార్, దేవానంద్ చిత్రోత్సవాలను ఎఫ్.హెచ్.ఐ నిర్వహించినట్లు శివేంద్ర సింగ్ పేర్కొన్నారు.

వరద బాధితులకు సినీ ప్రముఖుల విరాళం







ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకునేందుకు పలువురు సినీ ప్రముఖులు ముందుకొచ్చారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించారు. బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని అనుకున్నా, తన వల్ల సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు ఆయన చెప్పారు.

జూనియర్ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి చెరో రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. 'భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం నన్ను కలచివేసింది, ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని ఎన్టీఆర్ చెప్పారు. మహేశ్ బాబు సైతం రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. వరదల్లో ముంపునకు గురైన ప్రజలు తొందర్లోనే కోలుకోవాలని, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత ఎస్. రాధాకృష్ణ, ఎస్. నాగవంశీ కలసి రెండు రాష్ట్రాలకు కలిపి రూ. 50 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు హీరో సిద్ధు జొన్నలగడ్డ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. 30 లక్షల సాయాన్ని ప్రకటించారు. హీరో విష్వక్సేన్ రెండు రాష్ట్రాలకు చెరో రూ. 5 లక్షల చొప్పున సాయాన్ని ప్రకటించారు. దర్శకుడు వెంకీ అట్లూరి రూ. 10 లక్షలు, హీరోయిన్ అనన్య నాగళ్ల రూ. 5 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైజయంతి మూవీస్ రూ. 25 లక్షలు ప్రకటించగా, నిర్మాత బన్నీవాస్ 'ఆయ్' చిత్రం వసూళ్లలో పాతిక శాతాన్ని ఏపీ వరద బాధితులకు విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. సహాయనిధికి విరాళాలను ప్రకటించిన సినీ ప్రముఖులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపారు.

ఆ తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది



బాలకృష్ణ

'తాతమ్మ కల' చిత్రంతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి, యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం ఇటీవల వైభవంగా జరిగిన సంగతి విదితమే. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'యాభై ఏళ్ల క్రితం మా నాన్నగారు నా నుదిటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. యాభై ఏళ్ల నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగు జాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీ కోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని చెప్పారు బాలకృష్ణ. రెండు తెలుగు రాష్ట్రాలను వరద ముంచెత్తుతున్న ఈ తరుణంలో ఆయన స్పందిస్తూ 'ఈ విపత్కర పరిస్థితుల్లో బాదాతప్త హృదయంతో నా బాధ్యతగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 లక్షలు బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. తెలుగు రాష్ట్రాల్లో అతి త్వరలోనే మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని వెల్లడించారు.

నాన్నే నా హీరో



ఎనభైల దశకంలో బాలీవుడ్‌లో విలన్‌గా ఒక వెలుగు వెలిగిన శక్తి కపూర్ మంగళవారం తన 72వ పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నారు. ఎంతో మంది ఆయనకు అభినందనలు తెలిపారు కానీ కుమార్తె శ్రద్ధా కపూర్ ఇచ్చిన పొగడ్త శక్తికపూర్‌కు ఎంతో శక్తినిచ్చింది. మరికొన్నేళ్ల పాటు జీవించాలనే ఉత్సాహాన్ని కలిగించింది. తండ్రితో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'నాన్నే నా హీరో. తండ్రి అండదండలు ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలం' అని కామెంట్ పెట్టింది శ్రద్ధా. ఆమె నటించిన 'స్త్రీ 2' చిత్రం ఇప్పుడు వసూళ్ల పరంగా సంచలన రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతోంది.

వైరముత్తుపై పోరాటంలో వెనకడుగే లేదు



చిన్మయి శ్రీపాద

ఎన్ని బెదిరింపులు వచ్చినా, పరిశ్రమ బహిష్కరణ విధించినా వెరవకుండా దక్షిణాది చిత్రసీమలో 'మీటూ' ఉద్యమానికి చుక్కానిలా నిలిచారు ప్రముఖ గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద. కొన్నేళ్లుగా ఆమె సోషల్ మీడియా వేదికగా మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో ఆమె మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళ పాటల రచయిత వైరముత్తు చేతిలో తాను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని, ఆ కేసులో తాను ఇంకా పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. ప్రముఖ గీత రచయిత, పద్మ పురస్కార గ్రహీత, సంగీత నాటక అకాడమీ సహా పలు జాతీయ పురస్కారల విజేత అయిన సెలబ్రిటీ చేతిలో తాను వేధింపులకు గురయ్యానంటూ చిన్మయి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాతో పాటు మరికొందరు మహిళలు స్వయంగా మీడియా ముందుకు వచ్చి నోరు విప్పినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. దీన్ని తమిళ సినీ పెద్దలందరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని నిరసన వ్యక్తం చేశారు. వైరముత్తుకు తమిళనాడులోని రాజకీయ పార్టీల అండదండలు పుష్కలంగా ఉండడం వల్లే ఇన్నేళ్లైనా తనకు న్యాయం జరగలేదని ఆమె ఆరోపించారు. అతను ఎలాంటి వాడో అందరికీ తెలిసిందే, అయినా అయనపై చర్యలు తీసుకోకపోగా నన్నే బలిపశువును చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'తమిళ చిత్ర పరిశ్రమ నా పై కక్ష గట్టింది. అప్పటి డీఎంకే నేత, ఇప్పటి బీజేపీ నాయకుడు... డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ రాధారవి నాపై బహిష్కరణ వేటు వేశార'ని చెప్పారు. 'మెజారిటీ తమిళ సమాజం, నా తోటి సంగీత కళాకారులు సైతం తప్పంతా నాదే అన్నట్లు దుర్భాషలాడారు. అయినా వెనకడుగు వేయకుండా, వైరముత్తు వేధింపులపై ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నాను. మున్ముందూ ఇది కొనసాగిస్తాను' అని చిన్మయి చెప్పారు.

'ప్రేమమ్' హీరోపై అత్యాచారం కేసు



జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో పలువురు మాలీవుడ్ ప్రముఖులపై వరుసగా అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. తాజాగా 'ప్రేమమ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటుడు నివిన్ పౌలీపై అత్యాచారం కేసు నమోదైంది. ఓ నటి ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనను దుబాయ్ తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ప్రాథమిక విచారణ పూర్తి చేసిన పోలీసులు నివిన్ సహా మరో ఆరుగురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

తప్పుగా అర్థం చేసుకున్నారు

తమిళ అగ్రహీరో రజనీకాంత్‌ను 'జస్టిస్ హేమ కమిటీ గురించి మీ అభిప్రాయం చెప్పండి' అని మీడియా కోరగా, 'దాని గురించి నాకేం తెలియదు, క్షమించండి' అని బదులిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై కొంతమంది మీటూ ఉద్యమకారులు, నెటిజన్లు రజనీకాంత్ వైఖరిని తప్పుపట్టిన నేపథ్యంలో తమిళ నటి రాధికా శరత్‌కుమార్ ఆయన్ని వెనుకేసుకొచ్చారు. రజనీకాంత్‌కు నిజంగానే హేమ కమిటీ గురించి ఏమీ తెలియదనీ, అందుకే ఆయన దాని గురించి మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. ఆయన మౌనాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడం బాధాకరమన్నారు.

కొత్తగా..

ఆడ లేడీస్ వర్సెస్ మగ జెంట్స్



శ్రీవిష్ణు హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం విడుదల తేదీ ప్రకటించారు. హసిత్ గోలీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా దసరా పండగకు పది రోజుల ముందే అంటే అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సినిమాతో శ్రీవిష్ణు మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన సరసన రీతూ వర్మ నటించారు. సినిమాలో ఆడ లేడీస్, మగ జెంట్స్ మధ్య ఉండే ఆసక్తికరమైన కంటెంట్ అలరిస్తుందని శ్రీవిష్ణు, రీతూ వర్మ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.మీరా జాస్మిన్, సునీల్, దక్ష నగర్కార్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

తుపాకులతో పోలీసు బందీ



సన్నీ అఖిల్, గిద్దేష్ అజయ్ ఘోష్ తదితరులు నటించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ లాగానే ఫస్ట్ లుక్ కూడా విభిన్నంగా ఉంది. సాధారణంగా ఎవరినైనా తాళ్లతోనూ, సంకెళ్లతోనో బంధిస్తారు. కానీ ఒక పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉంది' అని అభినందించారు. అభ్యుదయ చిత్రాల దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

సాగుదారుని పేరు నమోదు చేయండి

● వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి రాజశేఖర్



దంతలూరులో వర్షానికి మునిగిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

కొల్లిపర, సెప్టెంబరు 3 : కృష్ణానది వరదకు, వర్షాలకు ముంపునకు గురైన పొలాల్లో పంట నష్టానికి నిజమైన సాగుదారుని పేరు నమోదు చేయాలని వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బి.రాజశేఖర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, దంతలూరు, అత్తోట గ్రామాల్లో వర్షాలకు, వరదలకు ముంపునకు గురైన పంటలను వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, వ్యవసాయ, రెవెన్యూ, శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. పంట నష్టం వివరాలను వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వర్షపు నీరు బయటకు పోయేలా తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఈ పంటలో తప్పనిసరిగా సాగుదారుని పేరు నమోదు చేసి వారికి ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ వరద ద్వారా ముంపునకు గురైన ప్రతి పొలాన్ని పరిశీలించి పంట నష్టం అంచనా వేసి నివేదిక తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ శారదా జయలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనసింహ, జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఏడీఏ ఉషారాణి, వ్యవసాయాధికారులు వెంకట్రావు, సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 3: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు మూడో రోజు బుధవారం కూడా సెలవు ప్రకటిస్తు కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది వారు పని చేస్తున్న పాఠశాలలకు హాజరు కావాలని, పాఠశాలల్లో పారిశుధ్య సమస్యలు పరిష్కరించి తిరిగి పాఠశాలలు పూర్తిస్థాయిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎవరైనా పాఠశాలలు, కళాశాలలు తెరిస్తే సంబంధిత యాజమాన్యాలపై క్రమశిక్షణా చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

● అధికారుల పని తీరు భేష్
● నిర్వాసితులకు నాణ్యమైన భోజనం అందించండి
● వరద పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
● సమీక్షా సమావేశంలో మంత్రులు గొట్టిపాటి, అనగాని, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్, మంత్రి రవికుమార్, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 3: అధికారులు మెరుగ్గా పని చేయడంతో వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె.వెంకటమురళి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులతో కలిసి కొల్లూరు కరకట్ట వద్ద నిర్వాసితులకు పడవల ద్వారా ఆహార పదార్థాల సరఫరాను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యాశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిర్వాసితులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో మంత్రులు, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రమాదం పొంచి ఉందని గుర్తించి అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో మరో 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు ఎంతో బాధ్యతగా పని చేశారని అధికారులు, సిబ్బందిని అభినందించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి బలోపేతానికి కృషి చేయాలన్నారు. రహదారిపై పడిన గండ్లు పూడ్చాలన్నారు. లంక గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణకు సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ నుంచి 1000 మంది లైన్‌మెన్‌లను పంపించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. 1000 సోలార్ ల్యాంప్‌లు ఇస్తామని చెప్పారు. రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయన్నారు. బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేస్తే ఎలా ఉంటుందో చేసి చూపించారని చెప్పారు. నిత్యవసర సరకులు, వైద్యం సకాలంలో అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ గతంలో కంటే వరద అధికంగా రావడంతో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురైయ్యాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ వరద ఉధృతి 8.64 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో కొంతమేరకు ప్రమాదం తగ్గినట్లేనన్నారు. వరద అనంతరం లంక గ్రామాల్లో పేరుకుపోయిన బురద, చెత్తను తొలగించాలని సూచించారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా వరద ప్రవాహం 11.50 లక్షల క్యూసెక్కులకు చేరడంతో 24 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. ప్రజలు 24 వేల మందికి పైగా లంక గ్రామాల్లో ఉండిపోయారని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి 750 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. ఆహార పదార్థాలను అందించేందుకు 40 మరబోట్లు నడుపుతున్నామని, 200 లైఫ్ జాకెట్లు సిద్ధం చేశామన్నారు. 65 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. వరద విపత్తుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ పలు సూచనలు చేశారని చెప్పారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న కుటుంబాలకు నిత్యవసర సరకులు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఒక కుటుంబానికి 25 కేజీల బియ్యం, నూనె ప్యాకెట్, కిలో చొప్పున కందిపప్పు, పంచదార, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, చేనేతలు, మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ అధికారికంగా ప్రకటించే వరకు లంక గ్రామాల్లో ప్రజలు ఎలాంటి రాకపోకలు సాగించరాదని సూచించారు. సమీక్షా సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీవో, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 3: వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం కొల్లిపర మండల పరిధిలోని అత్తలూరిపారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, బొమ్మువానిపాలెం గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. వరద ముంపు గ్రామాల్లో మూడో రోజు కొనసాగుతున్న సహాయక చర్యలను ఆయన పరిశీలించారు. కరకట్ట ఎక్కడైన కోతకు గురైందేమోనని పరిశీలించి ఇరిగేషన్ అధికారులను తగిన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కృష్ణానదికి వరదనీటి ప్రవాహం తగ్గే వరకు కరకట్టను పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కృష్ణానది కుడి కరకట్ట 8 చోట్ల కోతకు గురైందనీ, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. వరద ఉధృతి తగ్గేవరకు లంకగ్రామాల ప్రజలకు అండగా ఉంటామన్నారు. కొత్తూరులంక, అన్నవరంలంక, బొమ్మువానిపాలెం గ్రామాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. పునరావాస కేంద్రాలకు 215 మందిని తరలించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ సుమారు 67వేల కుటుంబాలకు 25 కిలోల బియ్యంతోపాటు కిలో చొప్పున కందిపప్పు, పంచదార, లీటర్ పామాయిల్ అందజేసినట్లు తెలిపారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, నాయకులు కొండా శివారెడ్డి, అడపా నారాయణరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, బొమ్ము శివరామిరెడ్డి, మొవ్వా వెంకయ్య తదితరులు ఉన్నారు.

సీఐనా.. వైసీపీ కార్యకర్తనా?

● ఇడుపులపాయలో వైఎస్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు
● గతంలో పులివెందులలో జరిగిన జయంతికి కూడా..
● గత ఎన్నికల సమయంలో అరండల్‌పేట సీఐగా విధులు
● ఓ ఆసుపత్రి వివాదంలో వీఆర్‌కు

గుంటూరు, సెప్టెంబరు 3: ఆయన సీఐనా.? లేదంటే వైసీపీ కార్యకర్తనా? అనేది పోలీస్ ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది. ప్రస్తుతం రేంజ్ వీఆర్‌లో ఉన్న ఐ వెంకటేశ్వరరెడ్డి అనే సీఐ సోమవారం కడప జిల్లాలోని ఇడుపులపాయలో జరిగిన దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనడం పోలీస్ శాఖలోనే కాక, రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. వైఎస్ కుటుంబంపై ఎంత అభిమానం ఉంటే మాత్రం పోలీస్ శాఖలో బాధ్యత కలిగిన సీఐ హోదాలో ఉన్న ఆ అధికారి బహిరంగంగా వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో ఎలా పాల్గొంటారని పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన్ను వైసీపీ ప్రభుత్వం అరండల్‌పేట సీఐగా నియమించింది. అంతకుముందు వైసీపీ ప్రభుత్వంలో ఆయన ఏపీ, తమిళనాడు సరిహద్దు స్టేషన్ సూళ్ళూరుపేటలో ఏకంగా నాలుగేళ్ల విధులు నిర్వహించారు. ఆయన ప్రత్యేకత ఏమిటంటే వైఎస్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉండటమే. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డితోనూ సంబంధాలు ఉన్నాయి. ఏదైనా కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరెడ్డి కనిపిస్తే జగన్ ఆయన్ను అన్నా అని పిలుస్తాడని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చొరవతోనే ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా సూళ్ళూరుపేట సీఐగా విధులు నిర్వహించారు. ఆయన అక్కడ పనిచేసిన సమయంలో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయనకు ఏకంగా సీఎంతోనే పరిచయం ఉందనే ప్రచారంతో పోలీస్ ఉన్నతాధికారులు సైతం ఆయన విషయంలో పట్టించుకునేవారు కాదని పోలీస్ వర్గాలు అంటున్నాయి. గత ఎన్నికల సమయంలో అరండల్‌పేట సీఐగా ఆయన వైసీపీ విజయానికి తన వంతు కృషి చేసినట్లు కూటమి పార్టీలు అప్పట్లోనే ఆరోపించాయి. కొరిటెపాడులో జరిగిన జనసేన, వైసీపీ ఫ్లెక్సీల వివాదంలోనూ, అలాగే కొరిటెపాడు సెంటర్‌లో వైసీపీ విగ్రహానికి అవకాశం ఇచ్చి, ఎన్టీఆర్ విగ్రహం పెట్టేందుకు యత్నించిన టీడీపీ వారిని కేసుల పేరుతో బెదిరించడం, పోలింగ్ రోజు బూత్‌ల వద్ద టీడీపీ వారి పట్ల అనుచితంగా ప్రవర్తించడం వంటి అనేక ఏకపక్ష కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక ఎన్నికల తరువాత అరండల్‌పేటలో ఓ ఐపీఎస్ అధికారి సతీమణి, మరో వైద్యుడికి మధ్య ఓ క్లినిక్ భాగస్వామ్యం విషయంలో వివాదం తలెత్తింది. ఈ విషయంలో ఆయన ఐపీఎస్ అధికారి సతీమణి తరఫున రంగంలోకి దిగి వైద్య దంపతుల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. పసిపిల్లతో ఉన్న వైద్యురాలి నుంచి రాత్రి సమయంలో సెల్‌ఫోన్ లాక్కొని, కనీసం పసిపాపకు పాలు ఇచ్చే అవకాశం ఇవ్వకుండా నిర్బంధించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై బాధిత వైద్య దంపతులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంలోనే సీఐను వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న ఆయన ఏకంగా వైసీపీ కార్యకర్త మాదిరిగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇంత బహిరంగంగా ఆయన జగన్ పాల్గొన్న వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనడం వైసీపీ కార్యకర్తలకే విస్మయాన్ని కలిగించింది. ఆయన పాల్గొన్న ఫొటోను వైసీపీ కార్యకర్తలే సోషల్ మీడియాలో వైరల్ చేయడం గమనార్హం. ఆయన సీఐనా? వైసీపీ కార్యకర్తనా? అంటూ నెటిజన్‌లు ప్రశ్నిస్తున్నారు.



వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వరరెడ్డి(సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

యరపతినేని సేవలపై రైల్వే ప్రశంస

● అధికారిక ఫేస్‌బుక్‌లో వెల్లడి



నడికూడి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఆహారం అందజేస్తున్న నిఖిల్

పిడుగురాళ్ల, సెప్టెంబరు 3: విపత్కర పరిస్థితుల్లో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రయాణికులకు చేసిన సేవలను దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేకంగా ప్రశంసించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వేశాఖకు చెందిన అధికారిక ఫేస్‌బుక్‌లో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందించిన సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. అల్పపీడనం ప్రభావంతో రైళ్లను నడికూడి రైల్వేజంక్షన్ మీదుగా దారి మళ్లించడంతో సుమారు 10 వేల మంది ప్రయాణికులకు ఆయన పాలు, పండ్లు, వెజ్ బిర్యాని అందించారని ఫొటోలతో సహా రైల్వేశాఖ అధికారిక ఫేస్‌బుక్‌లో వెల్లడించింది. ఆదివారం మధ్యాహ్నం 15 గంటల నుంచి రాత్రి 22 గంటల వరకు వేలాది మంది రైల్వే ప్రయాణికులకు ఆహార పదార్థాలు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్, పార్టీ శ్రేణులు అందజేశారని రైల్వేశాఖ వెల్లడించింది.

గుంటూరు గర్భిణికి బాంబే బ్లడ్

●దానం చేసిన గుంతకల్లు వాసి

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 3: గుంటూరుకు చెందిన ఓ గర్భిణికి ప్రసవ సమయంలో అవసరమైన ఓ నెగిటివ్ బాంబే గ్రూప్ రక్తాన్ని అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన పరుశురామ్ దానం చేశాడు. గుంటూరు సాయిరత్న ఆసుపత్రిలో ప్రసవం కోసం కస్తూరి అనే మహిళ చేరారు. ఆమెకు రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారు. ఆమెది అరుదైన ఓ నెగిటివ్ బాంబే బ్లడ్ గ్రూప్ కావడంతో కుటుంబ సభ్యులు ఆ రక్తం కోసం కర్నూలులోని ఓ రక్తదాతకు సంప్రదించారు. గుంతకల్లులో పరుశురామ్‌ది అదే గ్రూప్ అని తెలుసుకుని.. కస్తూరి కుటుంబ సభ్యులు గుంటూరు నుంచి మంగళవారం ఉదయం గుంతకల్లుకు చేరుకున్నారు. పట్టణంలోని గోపీ బ్లడ్ బ్యాంకులో పరుశురామ్ రక్తదానం చేశాడు. ఆ రక్తాన్ని తీసుకుని కస్తూరి కుటుంబ సభ్యులు గుంటూరు సాయంత్రం రైలులో బయలుదేరారు. రక్తదానం చేసిన పరుశురామ్‌కు కస్తూరి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



గోపి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న పరుశురామ్

18న అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

గుంటూరు, సెప్టెంబరు 3: ఈ నెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 16న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 17వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 18న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 19వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జి రూ. 2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 సంప్రదించాలని కోరారు.

హెలికాప్టర్ ద్వారా 21 మంది తరలింపు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలోని తుళ్లూరు మండలం పెదలంకలో కృష్ణానది వరద ప్రవాహంలో చిక్కుకొన్న 21 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు హెలికాప్టర్ సాయం తీసుకొన్నారు. విడతల వారీగా అందరిని ఎన్‌టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి మంగళవారం తరలించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకొన్నారు. గుంటూరు ఆర్‌డీవో పి.శ్రీకర్, ఏఎస్‌పీ కొల్లి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా ఉపాధి అధికారి రఘు, తుళ్లూరు డీఎస్పీ మల్లికార్జునరావు ఈ ఆపరేషన్‌ని పర్యవేక్షించారు. అలానే ఉద్ధండ్రాయునిపాలెంలో 250 మందిని పడవల ద్వారా పునరావాస కేంద్రానికి తరలించారు. వీరికి భోజన సదుపాయం కల్పించారు. 204 పశువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ నాటు పడవలో ప్రయాణిస్తూ కొల్లిపర మండలంలోని బొమ్మువానిపాలెంలో గ్రామస్థులను పునరావాస కేంద్రాలకు తరలించారు. తాడేపల్లి మండలంలోని మహానాడు ప్రాంతంలో వరదనీరు చేరిన నివాసాల వద్దకు వెళ్లి ప్రజలను పునరావాస కేంద్రాలకు రావాలని విజ్ఞప్తి చేసి ఒప్పించి తీసుకొచ్చారు.

వరద బాధితులకు భాష్యం చేయూత



వరద బాధితులకు ఆహారం అందించేందుకు వెళ్లే వ్యాను వద్ద ఉపాధ్యాయులు, సిబ్బంది

గుంటూరు(విద్య), సెప్టెంబరు 3: కృష్ణా జిల్లాలో వరద బాధితులకు చేయూత అందించే లక్ష్యంతో భాష్యం విద్యాసంస్థలు తమవంతు వితరణ ప్రకటించాయని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరద బాధితుల కోసం 70 వేల పులిహోర ప్యాకెట్లు, పెరుగన్నం ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యం వల్ల ప్రజలు పడుతున్న కష్టాలు ఎవరికీ రాకూడదన్నారు. వరద ప్రభావిత ముంపు ప్రాంతాల్లో బాధితుల్ని ఆదుకునేందుకు భాష్యం విద్యాసంస్థలు తమ తరుపున స్వయంగా తయారు చేసిన పులిహోర, పెరుగన్నం ప్యాకెట్ల మంగళవారం విజయవాడ తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

వరద భయంతో ఆగిన గుండె



కొల్లూరు శ్మశాన వాటిక కూడా వరద నీటిలోనే ఉండడంతో కరకట్టపైనే దహన సంస్కారాలు

తెనాలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇంటి చుట్టూ ఎటు చూసినా వరద.. బయటపడే మార్గమే లేదు! అప్పటి వరకూ ఇంటి బయటే ఉన్న నీరు ఒక్కసారిగా ఇంటిలోపలికి చొచ్చుకొచ్చింది. క్రమంగా నీటి మట్టం పెరుగుతుండడంతో ఆ కుటుంబం భయపడిపోయింది. దీంతో కుటుంబ పెద్ద కృష్ణారావు(65) మరింత ఆందోళన చెందారు. హఠాత్తుగా గుండె ఆగి తనువు చాలించారు. మరోవైపు దహన సంస్కారాలు చేద్దామన్నా, శ్మశాన వాటిక కూడా వరదలో మునిగిపోవడంతో కుటుంబ సభ్యుల ఆవేదనకు అంతులేకుండాపోయింది. హృదయ విదారకమైన ఈ ఘటన బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలో చోటుచేసుకుంది. కృష్ణానది పొంగి ప్రవహించడంతో మండలంలోని ఆవులవారిపాలెం గ్రామం వరదలో చిక్కుకుంది. చుట్టూ నీరు చేరడంతో రెండు రోజులుగా గ్రామస్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. శనివారం రాత్రి వరద ఉధృతి పెరగడం, ఇళ్లలోకి నీరు చేరుతుండడంతో కృష్ణారావు తీవ్ర ఆందోళన చెందారు. సురక్షిత ప్రదేశానికి ఎక్కడికైనా వెళ్లిపోదామని భావించినా అక్కడి నుంచి బయటికి తీసుకురాలేని పరిస్థితి. కృష్ణా నది వరద ప్రవాహవేగం ఎక్కువగా ఉండడంతో పడవలను కూడా అధికారులు అనుమతించలేదు. రాత్రి సమయం కావడం, పడవల్లో శ్రేయస్కరం కాదని కుటుంబ సభ్యులు చెప్పినా శాంతించని కృష్ణారావు.. తీవ్ర ఆందోళనకు గురై చివరికి గుండెపోటుతో తనువు చాలించారు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆ బాధను దిగమింగుకుని తండ్రి దేహానికి దహన సంస్కారాలు చేద్దామనుకున్నా చుట్టూ నీరు తప్ప, శ్మశానం కాదుకదా, కనీసం నీరులేని మెరక భూమే కనిపించలేదు. దీంతో దిక్కుతోచక కుమారుడు వెంకటేశ్ అధికారులకు మంగళవారం సమాచారం అందించాడు. వెంటనే అధికారులు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను లైవ్ బోట్ సాయంతో పంపించి మృతదేహాన్ని గ్రామం నుంచి వరద నీటిని దాటించి కరకట్టపైకి చేర్చగలిగారు. అయితే కొల్లూరు శ్మశాన వాటిక కూడా వరద నీటిలోనే ఉండడంతో చివరికి కొల్లూరు-దోనేపూడి మధ్య కృష్ణా కుడి కరకట్టపైనే చితి ఏర్పాటు చేసి దహన సంస్కారాలు పూర్తిచేశారు. ఈ దృశ్యాలు చూపరులను కూడా కంటతడిపెట్టించాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

42,589 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 45,449 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 42,589 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 21,569 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	16000	334	8200	14000
నెంబరు. 5	8000	13500	నెంబరు. 5	8000	13000
273	9600	13000	273	10500	11000
341	8000	14500	341	9500	12500
4884	8900	11500	4884	11000	11500
సూపర్ 10	-	-	సూపర్ 10	12000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18600	తేజ	7500	18300
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	8000	13700	దేవనూరు డీలక్స్	10000	16000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	4500	11500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



పొలాలను, మురుగుకాల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

నీట మునిగిన పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 3 : మండలంలోని భవనంవారిపాలెం, కోమలి గ్రామపంచాయతీల పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన వరి పొలాలను ఎమ్మెల్యే నరేంద్రవర్మ, వ్యవసాయశాఖ, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ అధైర్యపడవద్దని చెప్పారు. సమగ్ర నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఆదుకుంటామని భరోసానిచ్చారు. ముందుగా యాజలి డ్రెయిన్ పరిశీలించిన ఎమ్మెల్యే నరేంద్రవర్మకు రైతులు సుమారు 2 వేల ఎకరాలకు పైగా వరిపొలాలు సాగు చేశామని, వర్షాలకు నీళ్ళ పాలైందన్నారు. ఈవిషయమై ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యేను కోరారు. రానున్న వ్యవసాయ తరుణంలో పంటకాల్వలను మరమ్మత్తులు చేసేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని, కాల్వలపై ఉన్న వంతెనలు గురించి సంబంధితాధికారులతో పరిశీలించి సమగ్ర సమాచారాన్ని తీసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, టీడీపీ, బీజేపీ, జనసేననాయకులు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు లక్కంరాజు వెంకటపతిరాజు, కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకరరెడ్డి, కలకోట కిషోర్‌రెడ్డి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, ఆయాగ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కోమలి సర్పంచ్ శ్యామలనాగిరెడ్డి, మంతెన గంగరాజు మోదుగుల వీరారెడ్డి, రైల్వేబోర్డు మాజీ సభ్యులు ఎస్ఎమ్ నియాజి, వ్యవసాయశాఖాధికారి సి.హెచ్.సత్యానంద్, ఎంపీడీవో భవనం మారుతీశేషమాంబ, డిప్యూటీ తహసీల్దార్, షేక్ కరీముల్లా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో నరేంద్రవర్మ సేవలు



బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 3 : భారీవర్షాల కారణంగా ముంపునకు గురైన విజయవాడలోని 64వ డివిజన్‌కు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను ఇన్‌చార్జిగా నియమించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపుమేరకు నరేంద్రవర్మ 64వ డివిజన్ కండ్రిగ ప్రాంతంలో రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఐఎఎస్ అధికారి వేణుగోపాలరెడ్డితో కలిసి మంగళవారం పర్యటించారు. బాధితులను పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల పంపిణీపై ఆరా తీశారు. అందలేదనే ఫిర్యాదులు రాకుండా నిరంతరం పర్యవేక్షించాలని జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలకు ఆహార కొరత లేకుండా ఇవ్వాలని ఎమ్మెల్యే వేగేశన అధికారులకు సూచించారు.

అంతర్‌రాష్ట్ర కరాటేలో బాపట్ల విద్యార్థులకు పతకాలు

బాపట్ల, సెప్టెంబరు 3 : ఒంగోలు సిద్దార్ధ కరాటే అకాడమి ఆధ్వర్యంలో జరిగిన అంతర్‌రాష్ట్ర కరాటే పోటీలలో బాపట్ల వైఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి విద్యార్థులు పతకాలు సాధించారు. అండర్-6 విభాగంలో ఆసిక్ కాంస్య పతకం, అండర్-7 విభాగంలో అక్షర స్తోరి వైట్‌బెల్ట్, కాంస్య పతకం, అండర్-10 విభాగంలో హేమసాయిశ్రీ బంగారు పతకం, వైట్ బెల్ట్, పి.విష్ణునాగసాయి బంగారుపతకం, కాంస్యపతకాలు, రిషిత వెండిపతకం, వైట్‌బెల్ట్, బి.దేవమణికంఠ కాంస్యపతకాలు, ఆరంజి బెల్ట్, అండర్-11 విభాగంలో కూచిపూడి సుశాంత్ బంగారుపతకం, కాంస్యపతకం, బ్లూబెల్ట్, అండర్ -12 విభాగంలో సయ్యద్ అసద్ బంగారుపతకం, వెండిపతకం, వైట్‌బెల్ట్, అండర్-13విభాగంలో మహ్మద్ అల్తాఫ్ కాంస్యపతకం, బ్లాక్‌బెల్ట్, అండర్-14 విభాగంలో గుమ్మడి కార్తీక్ వెండి పతకం, వైట్ బెల్ట్, అండర్-14 విభాగంలో మునిపల్లె జాగృతి బంగారుపతకం, కాంస్యపతకం, బ్లాక్‌బెల్ట్, అఖిల కాంస్యపతకం, వైట్‌బెల్ట్, సుహానా వెండిపతకం, బ్లాక్‌బెల్ట్‌లు సాధించినట్లు కోచ్ యర్రా నాగేశ్వరరావు, రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబా దేవాలయ అర్చకులు మోహన రత్నసాయి, కె.చంద్రశేఖర్, వెంకుసనాతని, సాయికిరణ్, కృష్ణ, కృష్ణకిషోర్ తదితరులు అభినందించారు.

ముగిసిన యూనిక్స్ శిక్షణ

బాపట్ల, సెప్టెంబరు 3 : బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గత నెలరోజులుగా బెంగుళూరుకు చెందిన ఉన్నతి సంస్థ, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిక్స్ శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఆంగ్ల భాషపై పట్టు, జీవన నైపుణ్యాలు, నైతిక విలువలపై విద్యార్థుల జీవితానికి నాయకత్వ లక్షణాలు, నిర్వహణ, సామర్థ్యం ఎలా ఉండాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.అంజనేయులు, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్, ఛేంజ్‌మేకర్ కె.రామకృష్ణారెడ్డి మౌఖిక ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన కమ్యూనికేషన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్, హెచ్‌వోడి భవానీని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌టివో వెంకట్, బోటనీ విభాగాధిపతి డాక్టర్ ఓ.రాజకుమారి, కంప్యూటర్ విభాగాధిపతి పిచ్చయ్య, లక్ష్మీ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు

చెకుముఖి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలి : జేవీవీ

బాపట్ల, సెప్టెంబరు 3 : చెకుముఖి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని జనవిజ్ఞానవేదిక నాయకులు పిలుపునిచ్చారు. జనవిజ్ఞానవేదిక బాపట్ల డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించే సంబరాలకు సంబంధించిన పోస్టర్‌లను మంగళవారం ఎంఈవో ఎస్.నిరంజన్ ఆవిష్కరించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ సంబరాలలో పాల్గొనాలని కోరారు. ఆయా విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు దీనికి సహకారం అందించాలని జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు వై.భాస్కరరావు కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన పాఠశాల స్థాయి, అక్టోబరు 1వ తేదీన మండలస్థాయి, అక్టోబరు 27న జిల్లా స్థాయి, నవంబరు 9, 10 తేదీలలో రాష్ట్ర స్థాయి సంబరాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కె.రాజేశ్వరరావు, ఎన్‌వీ శివప్రసాద్, కె.మోహన్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

● జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు

బాపట్ల, సెప్టెంబరు 3 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్‌ఆర్ ఆధ్వర్యంలో ఎఎన్ఎం, జిఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జపానీస్ భాష ఎన్5, ఎన్,ఎన్3 స్థాయిలలో నేర్పించి వారికి జపాన్‌దేశంలో నర్సులుగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జపాన్ దేశంలో పనిచేయటానికి ఆసక్తి ఉంటే 32 సంవత్సరాలలోపు వయసు ఉన్నవారు అర్హులని 6 నెలలు శిక్షణ నావిస్ హెచ్‌ఐఆర్ బెంగుళూరులో జరుగుతుందన్నారు. శిక్షణ ఫీజు రూ.3 లక్షల 50 వేలు కాగా పాక్షిక శిక్షణ రుసుం రూ.50వేలు కాగా, నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25 వేలు చెల్లిస్తుందని, మిగిలిన రూ.25వేలు అభ్యర్థి చెల్లించాలన్నారు. మిగిలిన 3 లక్షలు మూడు విడతలుగా అభ్యర్థి చెల్లించాల్సిందిగా తెలియజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్ దేశంలో ఉద్యోగావకాశం కల్పించటానికి సదుపాయాలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్‌ఆర్ పర్యవేక్షిస్తుందన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థి జీతం రూ.లక్షా10 వేలు నుంచి లక్షా40వేల రూపాయల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు 8978886348 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్థిక సాయం

బాపట్ల, సెప్టెంబరు 3 : పట్టణంలోని అక్బర్‌పేటకు చెందిన బోలిశెట్టి రామారావు మృతి చెందటంతో కుటుంబ సభ్యులకు మంగళవారం ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాళం నరేష్, ఉపాధ్యక్షుడు పల్లపోతు దిలీప్, ఇమ్మడిశెట్టి రాము, బొమ్మిశెట్టి ప్రసాద్, మారం మణి, పవన్, బాస్కరునిహేమంత్, కె.మోహన్, వి.పవన్ పాల్గొన్నారు.

కరుణిస్తోన్న కృష్ణమ్మ

● జలదిగ్బంధం నుంచి బయట పడుతున్న లంక గ్రామాలు
● బురదతో నిండిన గృహాలు
● ఊపిరి పీల్చుకుంటున్న లంక గ్రామాల ప్రజలు



వరద ముంపులో తమలపాకు తోట

కొల్లూరు, సెప్టెంబరు 3 : మహోగ్ర రూపం దాల్చిన కృష్ణమ్మ ఎట్టకేలకు శాంతించింది. వరద తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే జలదిగ్బంధం నుంచి బయటపడుతున్నాయి. మంగళవారం ఉదయానికి వరద ప్రవాహం క్రమేపీ తగ్గుతోంది. సాయంత్రానికి లంక గ్రామాల్లో ఇళ్లలో నుంచి వరద నీరు బయటకు పోవడంతో ఇళ్లు మొత్తం బురదమయంగా మారాయి. ఇళ్లలోని బురదను శుభ్రపరిచేందుకు మహిళలు నానా తంటాలు పడుతున్నారు. వరద ప్రవాహం తగ్గినప్పటికీ అన్ని లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో మాత్రం ఇంకా చాలా గృహాలు వరద ముంపులోనే ఉన్నాయి. బుధవారం ఉదయానికి అవి కూడా ముంపు నుంచి బయటపడే అవకాశాలు ఉన్నాయి. క్రమేపీ వరద తగ్గుముఖం పట్టడంతో గ్రామాల్లోని రహదారులు కూడా ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. వరద దాటికి పూరిల్లు దెబ్బతినగా కొన్నిచోట్ల ప్రహరీ గోడలు విరిగి పడ్డాయి. కొన్ని ఇళ్లలో వరద ఉధృతికి వస్తువులు కొట్టుకుపోయాయని కూడా బాధితులు చెబుతున్నారు. ఇప్పటికీ లంక గ్రామాల్లో చాలా కుటుంబాలు డాబాలపైనే ఆశ్రయం పొందుతున్నారు. వరదకు తోడు కరెంట్ లేకపోవడంతో సోమవారం రాత్రి దోమల ధాటికి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. వరద తీవ్రతకు కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాను అధికారులు ఎంత వరకు పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే విద్యుత్ శాఖ ద్వారా వెయ్యి సోలార్ దీపాలను పంపించినట్లుగా కలెక్టర్ ప్రకటించారు. వాటిని పడవల ద్వారా ఆయా గ్రామాలకు తరలిస్తున్నారు.

ముంపులోనే వాణిజ్య పంటలు...

వరద ముంపులోనే వాణిజ్య పంటలు ఉన్నాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టినప్పటికి లంక గ్రామాల్లోని వాణిజ్య పంటల్లో మాత్రం వరద ముంపు వీడలేదు. మూడు రోజుల నుంచి అరటి, తమలపాకు, కంద, బొప్పాయి, ఇతర కూరగాయ పంటలతో పాటు పండ్ల తోటలు కూడా వరద నీటిలో నానుతున్నాయి. సుమారు 20 వేలకు పైగా ఎకరాలలో రైతులు ఆయా పంటలను లక్షలాది రూపాయలు వెచ్చించి సాగు చేపట్టారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆయా పంటలు వరద ముంపునకు గురి కావడంతో ఎందుకు పనికి రాకుండా పోతాయని తెచ్చిన రుణాలు తీరక ముందే కృష్ణమ్మ ముంచెయడంతో మళ్లీ పంటల సాగుకు కొత్త రుణాలు చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు.

ఊపిరిపీల్చుకున్న లంక గ్రామాలు

రేపల్లె, చెరుకుపల్లి, సెప్టెంబరు 3 : నిన్నమొన్నటి వరకు వరద వచ్చి గృహాలు పూర్తిగా దెబ్బతింటాయేమోనని భయాందోళన చెందారు. మంగళవారం వరద ఉధృతి తగ్గటంతో లంకగ్రామాలలోని ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. గృహాలు పూర్తిగా నీటిలో మునిగిపోయినప్పటికి ఒక్కరోజులోనే మూడు అడుగుల నీరు తగ్గుముఖం పట్టటంతో తమ గృహాలు కనబడుతున్నాయని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. వరి పంటలు దెబ్బతిన్నప్పటికి గృహాలు కూలిపోకుండా ఉండటం తమ కుటుంబాలకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయన్నారు. వరద ఉధృతిగా రావటంతో పెనుమూడి, పల్లెపాలెం గ్రామాలలోని నీటిలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి వసతులను కల్పించారు.



వరద నీరు చేరడంతో మంచంపైనే అన్ని వస్తువులు



లంక గ్రామాల్లో నీట మునిగిన పూరిల్లు



వరద ఉధృతికి పడిపోయిన ప్రహరీ

కదలని నీరు... బయటపడని పైర్లు

● 60 వేల ఎకరాలలో నాట్లు.. 30వేల ఎకరాలకు పైగా ముంపు



బాపట్ల-జమ్ములపాలెం వెళ్ళే రోడ్డులో మెడికల్ కళాశాల నిర్మాణం చేస్తున్న ప్రాంతంలో ముంపునకు గురైన పొలాలు

బాపట్ల, సెప్టెంబరు 3 : ముంపునకు గురైన పొలాలలో చుక్కనీరు కూడా బయటకు వెళ్ళటంలేదు. గత 5 రోజులుగా పొలాలలో నిలిచిన నీరు బయటకు వెళ్ళకపోగా పై నుంచి వస్తున్న వరదనీరు తోడుకావటంతో నీటిమట్టం గణనీయంగా పెరుగుతున్నది. దీంతో రైతులు పొలాల మీద ఆశ వదులుకున్నారు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో సుమారు 60 వేల ఎకరాలకు పైగా వరినాటు వేశారు. అందులో ప్రస్తుతం 30 వేల ఎకరాలకు పైగా పూర్తిస్థాయి నీటిలో మునిగిపోయాయని మిగిలిన పొలాలు పాక్షికంగా మునిగి దెబ్బతిన్నాయని అధికారులు గుర్తించారు. బాపట్ల, జమ్ములపాలెం, జిల్లెళ్ళమూడి, గోపాపురం, పూండ్ల, భర్తీపూడి, మర్రిపూడి, గుడిపూడి, ఈతేరు, చుండూరుపల్లి, నరసాయపాలెం, కంకటపాలెం, మూలపాలెం తదితర ప్రాంతాలలోని పొలాలు చెరువులా కనిపిస్తున్నాయి. ఈ పొలాలలో నీరు బయటకు పోవాలంటే నల్లమడ డ్రెయిన్, పేరలి డ్రెయిన్, తుంగభద్ర డ్రెయిన్‌లో నీటిమట్టం తగ్గితేనే సాధ్యమౌతుంది. ఈ డ్రెయిన్‌లు మొత్తం ఎగువ ప్రాంతాలు నుంచి వస్తున్న వరదనీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. దీనివల్ల పొలాలలో నీరు మురుగుకాల్వల ద్వారా మేజర్ డ్రెయిన్‌లకు వెళ్ళే పరిస్థితి కనిపించటంలేదు. ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి ఉంది.

అసలే ఆలస్యంగా విత్తిన పొలాలు కావటంతో లేతపైర్లు మొత్తం నీటిలో మునిగిపోవటం వల్ల కుళ్ళి వాసన వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల నుంచి జమ్ములపాలెం వెళ్ళే రోడ్డులో మెడికల్ కళాశాల నిర్మాణం చేస్తున్న ప్రాంతం మొత్తం జలమయమైంది. పొలాలు, డ్రైన్‌లు, కళాశాలల నిర్మాణం చేస్తున్న ప్రాంతం పక్కనే ఉన్న కాలనీలు మొత్తం ఏకమై నీటితో నిండి ఉన్నాయి. వాతావరణం ఇదేవిధంగా ఉంటే వరద ఉధృతి తగ్గితే పొలాలలో నీరు బయటకు వెళుతుందని రైతులు, అధికారులు పేర్కొంటున్నారు. లేకుంటే పైర్లు ఏమాత్రం పనికిరావు.

పొలాల్లోని నీటిని బయటకు మళ్లించాలి

● వ్యవసాయ శాఖ డీడీ విజయనిర్మల

కొల్లూరు, సెప్టెంబరు 3 : అధిక వర్షాలకు నీట మునిగిన వరి పైరులోని నీటిని వీలైనంత త్వరగా బయటకు మళ్లించాలని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల రైతులకు సూచించారు. మండల పరిధిలోని చినపులివర్రు, గురివిందపల్లి గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను డీడీతో పాటు వరి పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త కె.యానిమృదుల, డాక్టర్ ఎం.ఉషా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, నీటిని బయటకు తరలించిన తరువాత ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను పైరులో వేసుకోవాలన్నారు. అధిక వర్షాల వల్ల పైరుకు బ్యాక్టీరియా, ఎండు తెగులు సోకే అవకాశం ఉందని, కావున పొటాష్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. పాముపొడ తెగులు ఆశిస్తే నివారణకు ఎకరాకు ఎక్సాకొనాజోల్ 400 ఎంఎల్ లేదా క్లోరాన్ట్రిప్రోల్ 60 మి.లీ పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నందిని, వీఏఏ విజయ్, రైతులు పాల్గొన్నారు.

● వేమూరు, సెప్టెంబరు 3 : రైతులు వెద నాటు భూముల్లో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల సూచించారు. ఆమె మండలంలోని పెనుమర్రు, కోడివర్రు గ్రామాలలో మంగళవారం సాయంత్రం పర్యటించి వర్షాలకు నీటిలో మునిగిన నాట్లు పరిశీలించారు. రైతులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నష్టపోయిన ప్రతి రైతుకు సాయం అందించడం జరుగుతుందన్నారు. రైతులకు కొన్ని సూచనలు చేశారు. పర్యటనలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ మృదుల, గ్రామ వ్యవసాయశాఖ అసిస్టెంట్ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



చినపులివర్రు వద్ద నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న డీడీ విజయనిర్మల తదితరులు

● నగరం, సెప్టెంబరు 3 : భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన వరి పైర్లను రక్షించేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల డీడీఏడీఆర్‌సీ విజయనిర్మల అన్నారు. మండలంలోని ఈదుపల్లి పరిసర ప్రాంత గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సైంటిస్టు డాక్టర్ మృదుల, డాక్టర్ ఉషా, మండల వ్యవసాయాధికారి రమేష్‌బాబు, ఎంపీఈవో కృష్ణమోహన్, రైతులు పాల్గొన్నారు.

● బాపట్ల, సెప్టెంబరు 3 : మండలంలోని అప్పికట్ల గ్రామంలో ముంపునకు గురైన వరి పొలాలను వ్యవసాయాధికారులు మంగళవారం రైతులతో కలిసి పరిశీలించారు. నీరు మొత్తం బయటకు వెళితేనే పైరు ఎంతవరకు తట్టుకొని నిలబడుతుందో చెప్పగలమని అధికారులు అంటున్నారు. రైతులు మాత్రం తాము కష్టపడి అధిక వ్యయప్రయాసలతో సాగు చేసిన పైరు మొత్తం నీటిపాలైందని కన్నీరుపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎ.లక్ష్మి, వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా గుర్రపు డెక్క తొలిగింపు



కావూరు వద్ద గుర్రపుడెక్కను తొలగిస్తున్న కావూరు గ్రామస్తులు

చెరుకుపల్లి, సెప్టెంబరు 3 : మురుగునీరు పారుదల కాక వరినాట్లు ముంపునకు గురవ్వటంతో గ్రామంలోని తొవ్వకాల్వలలో నీరు పారుదలకు అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క ఆకును కావూరు గ్రామస్థులు స్వచ్ఛందంగా మంగళవారం తొలగింపు చర్యలు చేపట్టారు. వందలాది ఎకరాలలో వరి పైరును కాపాడుకునేందుకు గ్రామస్థులు ఏకతాటిపైకి వచ్చి కాల్వలలో ఉన్న గుర్రపు డెక్కను తొలగించి పంట భూములలోని వర్షపునీరు పోయేందుకు చొరవ చూపారు. గుర్రపు డెక్కను తొలగించుకుంటే వందలాది ఎకరాలు ముంపునకు గురై కావూరు, తుమ్మలపాలెం, ఇంటూరు గ్రామాలలోని వరి నాట్లు వర్షపు నీటి ముంపునకు గురయ్యాయి. గుర్రపు డెక్క తొలగింపు వలన కొద్దిపాటి నీరు పంట భూములలో నుంచి మురుగుకాల్వలోనికి చేరుతుందని రైతులు తెలిపారు.

నలుగురు అధికారుల సస్పెన్షన్

బాపట్ల, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): వరద సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు అధికారులపై కలెక్టర్ వెంకట మురళి మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరు ఎంపీడీవోలతో పాటు ఇరిగేషన్ విభాగానికి సంబంధించిన ఇద్దరిపై వేటు పడింది. ఈ నలుగురికి రేపల్లె మండల పరిధితో పాటు కొల్లూరులో వరద సహాయ డ్యూటీలు వేశారు. ఆహార సరఫరా పంపిణీతో పాటు వారికి కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. మంగళవారం యంత్రాంగంతో నిర్వహించిన సమీక్షలో కూడా మరికొంతమంది అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. లంక గ్రామాలకు తాగునీరు, ఆహార పంపిణీ విషయంలో అధికారులు సమర్థవం తంగా పనిచేయలేకపోయారని కలెక్టర్ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

జగన్ వ్యాఖ్యలు సిగ్గు చేటు : కొల్లా

బాపట్ల, సెప్టెంబరు 3 : రాత్రింబవళ్ళు వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును జగన్ విమర్శించటం సిగ్గుచేటు అని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నీళ్ళల్లో తిరిగి ప్రతి కుటుంబాన్ని ఆదుకునే విధంగా చర్యలు చేపడుతుంటే చుట్టంచూపులా వచ్చి అరగంట పర్యటించి వెళ్ళి ఏసీ రూమ్‌లో కూర్చొని జగన్ మాట్లాడటం సరికాదన్నారు.



శిబిరంలో ఉన్న మహిళలతో మాట్లాడుతున్న మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్

ప్రతి ఒక్కరికి నివేశనస్థలాలు అందించి ఆదుకుంటా

● మంత్రులు అనగాని, గొట్టిపాటి

రేపల్లె, సెప్టెంబరు 3 : వరదనీటిలో చిక్కుకున్న ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పెనుమూడిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ వరద వచ్చినప్పుడల్లా ఇబ్బందులు పడుతున్నారని రానున్న రోజులలో ప్రభుత్వం తరుపు నుంచి నివేశనస్థలాలను ఇప్పించి ఆదుకుంటామని మహిళలకు భరోసానిచ్చారు. మహిళలు స్థలాలు ఇప్పించండి మీరు చెప్పిన విధంగా గృహాలు నిర్మించుకుని జీవనం సాగించుకుంటామని అన్నారు. వైద్యులు వరద ఉధృతి తగ్గినప్పటికి శిబిరాలలో ఉన్న ప్రతి ఒక్కరికి ఎప్పటికప్పుడు ఆరోగ్యపరిస్థితులు తెలుసుకుని మందులను అందించాలన్నారు. వైద్యులు పాముకాటు మందులను అందుబాటులో ఉంచుకుని ప్రజలకు సేవలు చేయాలని సూచించారు. అధికారులు శిబిరాలలోని ప్రజలకు ఉదయం,సాయంత్రం క్రమం తప్పకుండా సమయపాలన పాటించి ఆహారపదార్థాలను అందించాలన్నారు. గ్రామాలలో దెబ్బతిన్న రహదారులను కూడా పూర్తిస్థాయిలో నీరు తగ్గగానే అభివృద్ధిపరిచేందుకు చర్యలు చేపడతామని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్, ఆర్డీవో హేలా షారోన్, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో శివపార్వతి, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాసరావు, పంతాని మురళీధరరావు,తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, మేకా శివరామకృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు గ్రామాలపై ఎమ్మెల్యే ఆనందబాబు ప్రత్యేక దృష్టి

● పడవల ద్వారా ఆహారం, తాగునీరు సరఫరా

కొల్లూరు, సెప్టెంబరు 3 : వరద ముంపులో ఉన్న లంక గ్రామాలపై వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన మంగళవారం కొల్లూరు, భట్టిప్రోలు మండలా ల్లోని లంక గ్రామాలకు ఆహార పానీయాలను అందించేందుకు ముమ్మర చర్యలు తీసుకున్నారు. స్థానిక ఎంప్లాయిస్ క్లబ్‌లో భోజన తయారీ, కళ్యాణ మండపంలో ఆహారం ప్యాకింగ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం కొల్లూరు కరకట్ట దగ్గర ఉండి ప్రతి గ్రామానికి పడవ ద్వారా ఆహార పానీయాలను పంపించారు. దోనేపూడి, వెల్లటూరు, పల్లెపాలెం, ఓలేరు, పడవల పాయింట్‌ల వద్ద ఆహార పంపిణీని పరిశీలించారు. అమృతలూరు నుంచి 5 వేల ఆహార పొట్లాలను రప్పించి పడవల ద్వారా సరఫరా చేయించారు. అధికారులతో సమీక్షా సమావేశంలో ఉండగా కొన్ని గ్రామాలకు ఆహార పదార్థాలు వెళ్ళడంలో జాప్యం జరిగిందన్న సమాచారంతో హుటాహుటిన వెళ్లి ఆయా గ్రామాలకు ఆహార పదార్థాలను ఎందుకు పంపలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్త పరుస్తూ ఆ గ్రామాలకు ఆహార పదార్థాలను పంపించారు. వరద వల్ల దెబ్బతిన్న ఇళ్లు, వాణిజ్య పంట అంచనాలు నమోదుకు సిద్ధం కావాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక నాయకులు మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, యలవర్తి కోటేశ్వరరావు, సుంకర రాంబాబు, గుమ్మడి శివ ఉన్నారు.



ముంపు గ్రామాల ప్రజలకు పడవ ద్వారా సరఫరా చేయిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

లంక గ్రామాల్లో సహాయక చర్యలపై ప్రణాళికలు రూపొందించాలి

● అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు : కలెక్టర్

కొల్లూరు, సెప్టెంబరు 3 : వరద ప్రవాహం తగ్గిన తరువాత లంక గ్రామాల్లో తీసుకునే సహాయక చర్యలపై అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ వెంకటమురళీ ఆదేశాలు జారీ చేశారు. వరద ముంపు తదుపరి చర్యలపై మంగళవారం కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదతో దెబ్బతిన్న ప్రాంతాలలో అధికారులు పర్యటించాలన్నారు. భోజన పదార్థాలు అందించడంలో ఇబ్బందులు ఎదురైతే పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఎవరి నుంచి తమకు మంచినీరు, ఆహారం అందలేదనే ఫిర్యాదులు రాకూడదన్నారు. అధికారులు చేపట్టిన సహాయక చర్యలపై డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. సహాయక చర్యల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే నలుగురు అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. వైద్య శిబిరాల్లో సిబ్బంది సంఖ్యను పెంచుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు లంక గ్రామాల్లో నీటి సరఫరాకు కావాల్సిన చర్యలు చేపట్టాలని చెప్పారు. డయేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను శరవేగంగా చేపట్టాలన్నారు. దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణతో పాటు విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై కూడా ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు. పంట నష్టం అంచనాపై సర్వేపై ఆదేశాలు జారీ చేశారు. సహాయ చర్యల్లో ఎలాంటి ఆరోపణలు రాకుండా యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పలువురి సాయం



వరద బాధితులకు అల్పాహారం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

వేమూరు, సెప్టెంబరు 3 : కృష్ణానది పరివాహక ప్రాంతంలోని కొల్లూరు మండలం పరిధిలో ఉన్న లంక గ్రామాలలో వరద బాధిత కుటుంబాలకు ఆహారం అందించేందుకు పలువురు స్పందించారు. ప్రధానంగా టీడీపీ శ్రేణులు ఆహార పొట్లాలను సరఫరా చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో అధ్యక్షులు శ్రీనివాస్‌కుమార్ పర్యవేక్షణలో అనేక ప్రాంతాలలో అల్పాహారాన్ని మంచినీటి బాటిల్స్‌ను పంపిణీ చేస్తున్నారు. బూతుమల్లి గ్రామానికి చెందిన గ్రామ టీడీపీ అధ్యక్షుడు సత్యనారాయణ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను పలు లంక గ్రామాలకు పంపారు. పార్టీ సీనియర్ నాయకులు గోగినేని కేశవరావు, సర్పంచ్ వేమూరి శేషగిరిరావు, కనగాల రవి తదితరులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయ సంఘం నేతలు గంగిశెట్టి వెంకటేశ్వరరావు, బద్రి నారాయణ, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, ఆహార పదార్థాలు పంపిణీ



బాధితులకు ఆహారపదార్థాలు పంపిణీ చేస్తున్న నారాయణభట్టు తదితరులు

కర్లపాలెం, సెప్టెంబరు 3 : ప్రకృతి వైపరీత్యాలతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీఎస్ నారాయణభట్టు అన్నారు. పెనుమూడి, భట్టిప్రోలు, వెల్లటూరు ప్రాంతాలలోని వరద బాధితులకు బాపట్ల, కర్లపాలెం రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పండ్లు, ఆహార పదార్థాలు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గూడ శ్రీనిధి, కార్తికేయ, పానకాలరాయుడు సహకారంతో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఎంపీడీవో శివపార్వతి, తహసీల్దార్ శ్రీనివాస్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీవీ రమణబాబు, మల్లెల వేణు, కర్లపాలెం రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు పోలీసురావు, అంబటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బాసటగా..

ప్రత్యక్ష సహాయ కార్యక్రమాల పర్యవేక్షణలో మంత్రి డాక్టర్ స్వామి

జిల్లా నుంచి భారీగా ఆహార పొట్లాలు

మంచినీరు, ఇతర ఆహార పదార్థాలు సరఫరా

కలెక్టర్ నేతృత్వంలో రెండు రోజుల్లో లక్షా 25వేల ప్యాకెట్లు

ఎమ్మెల్యే జనార్దన్ ఆధ్వర్యంలో 30వేల పార్సిల్స్

ఒంగోలు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మూడు నాలుగు రోజుల పాటు ఎడతెరపి లేని వర్షం బెజవాడ నగరాన్ని ముంచెత్తింది. అదేసమయంలో ఎగువన కురిసిన భారీవర్షాలతో ఒకవైపు కృష్ణమ్మ, మరోవైపు బుడమేరు ఉగ్రరూపం దాల్చి చాలా ప్రాంతాలను ముంచెత్తాయి. లక్షలాది మంది వరదనీటిలో రోజులు తరబడి చిక్కుకొని తినడానికి తిండి లేక, తాగడానికి నీరు లేక అల్లాడుతున్నారు. స్వయంగా రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నా స్థానికంగా ఆహారం దొరికే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో సమీప జిల్లాల నుంచి ఆహారం, మంచినీరు, ఇతరత్రా పంపించాలన్న సంకేతాలు ప్రభుత్వం నుంచి అందాయి. దీంతో కలెక్టర్ అన్సారియా తక్షణం స్పందించారు. అందుబాటులో ఉన్న అధికారులతో సమీక్షించి వెంటనే నగరంలోని రెండు కళ్యాణ మండపాలను తీసుకొని ఆదివారం రాత్రి నుంచి వంట ప్రారంభింపజేశారు. సోమవారం మధ్యాహ్నం 25వేలు, రాత్రికి మరో 50వేల ప్యాకెట్ల పలావు, పులిహోర, పెరుగన్నం, అలాగే 50వేల మంచినీటి ప్యాకెట్లు, వేలాది బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడకు పంపించారు.

కలెక్టర్ ప్రత్యేక చొరవతో..

జిల్లా తరఫున జేసీ గోపాలకృష్ణ, డీఎస్‌ఓ ఉదయభాస్కర్ మరి కొంత మంది రెవెన్యూ సిబ్బంది కూడా అక్కడికి వెళ్లి సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జిల్లా నుంచి 35 బోట్లను పంపించారు. సోమవారం సాయంత్రం నుంచి నగరంలోని ప్రధానమైన హోటళ్ల నిర్వాహకులు, అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమాధిపతులు, ఇతరత్రా వర్గాల వారు అధికారులను సంప్రదించి వారి నుంచి సహకారం పొందడం ద్వారా మంగళవారం మరో లక్షా 20వేల ఫుడ్ ప్యాకెట్లను విజయవాడకు పంపించారు. ఒంగోలుతోపాటు మార్కాపురం, కొండపి, దర్శి తదితర ప్రాంత రెవెన్యూ అధికారులు పనిలో నిమగ్నం కాగా కలెక్టర్ అన్సారియా మంగళవారం నగరంలో వంట చేస్తున్న కళ్యాణ మండపాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆహారం రుచి చూసి మరి లారీలలో పంపించారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ స్వామి

వాయు గుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న భారీ వరద నీటితో అతలాకుతలమైన విజయవాడ వాసులకు బాసటగా జిల్లా ప్రజానీకం నిలుస్తున్నారు. ఇప్పటికే లక్షలాది మంది మునకలోనే ఉండిన నేపథ్యంలో వారికి ఆహారం, మంచినీరు అందించేందుకు యంత్రాంగంతో పాటు దాతలు ముందుకొచ్చారు. ప్రభుత్వం తరపున మంత్రి డాక్టర్ స్వామి ప్రత్యక్షంగా విజయవాడలోని పలు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. అదేసమయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక చొరవ చూపి జిల్లా యంత్రాంగం ద్వారా వివిధ వర్గాల సహకారంతో వేలాది ఫుడ్ ప్యాకెట్లు, మంచినీరు, ఇతర ఆహార పదార్థాలు అక్కడకు పంపిస్తున్నారు. అలాగే మంగళవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవ తీసుకొని భారీగా ఫుడ్ ప్యాకెట్లు పంపించారు.

సహాయక చర్యలలో మంత్రి

ఇక జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి సోమవారం సాయంత్రం విజయవాడలో జరిగిన సమీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ పెద్దల సూచనలతో మంగళవారం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఇబ్రహీం పట్నం మండలం మూలపాడు, కొండాపల్లి, విజయవాడ నగరంలోని చిట్టినగర్ ప్రాంతంలో పర్యటించి బాధిత ప్రజలను ఓదార్చారు. కొండపల్లి చిట్టినగర్‌లోని పునరావాస కేంద్రాలను సందర్శించారు. నష్టపోయిన పంటలను పరిశీలించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే దామచర్ల ఆధ్వర్యంలో..

మరోవైపు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవ చూపి 30వేల ఆహార ప్యాకెట్లు, 20వేల బాటిళ్ల మంచినీరు, భారీగా బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడకు పంపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి నుంచే వంట ప్రారంభించి ఆహారాన్ని ప్యాకింగ్ చేశారు. మంగళవారం ఉదయం మూడు లారీలలో వాటిని నింపారు. ఆ లారీలను ఎమ్మెల్యే జెండా ఊపి వరద ప్రాంతానికి పంపారు. అలాగే సహాయక చర్యలలో పాల్గొనేందుకు పలువురు కార్యకర్తలను విజయవాడకు పంపారు. ఇక ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలోనూ వేలాది ఆహార ప్యాకెట్లను విజయవాడలోని పారిశుధ్య కార్మికులకు అందించేందుకు పంపించారు



ఆహారం ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తరలిన పారిశుధ్య కార్మికులు

మరోవైపు వరద నీరు తగ్గాక అత్యవసర పారిశుధ్య పనుల కోసం ఒంగోలు కార్పొరేషన్ నుంచి 150 మంది కార్మికులను మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులలో విజయవాడకు పంపించారు. మరికొన్ని ప్రాంతాల ప్రజలు వివిధ రూపాలలో తమవంతు సాయాన్ని అందించే పనిలో ఉన్నట్లు తెలుస్తుండగా బుధవారం కూడా మరికొన్ని ఆహార ప్యాకెట్లు పంపించే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నారు.

మేమున్నాం..

వరద బాధితుల కోసం ముందుకొచ్చిన విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు

10 వేల ఆహార, 10వేల వాటర్ బాటిళ్లు సిద్ధం

ప్రత్యేక వాహనాల్లో తరలింపు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3: విజయవాడలో వరద ముంపు బాధితులకు మేమున్నామంటూ జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు ముందుకొచ్చారు. డీఈఓ డి.సుభద్ర ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడకు పది వేల పులిహోర ప్యాకెట్లు, పదివేల వాటర్ బాటిళ్లను ప్రత్యేకంగా స్కూల్ బస్సులను ఏర్పాటు చేసి తరలించారు. డీఈఓ కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులందరూ కలిసి ముంపు బాధితులకు తమవంతు సహాయపడ్డారు. ఇందుకు వివిధ విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా సహకారం అందించాయి. తరలించిన ఆహారం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను విజయవాడలోని స్టేడియంలో అక్కడి అధికారులకు అందజేశారు.



విజయవాడకు పంపేందుకు సిద్ధం చేసిన వాటర్ బాటిల్స్

ఆపన్నుల కోసం మేము సైతం..

బాధితులకు చేయూతగా అద్దంకి, పర్చూరు నేతలు

లంక, ముంపు గ్రామాల్లో మంత్రి రవికుమార్ సేవలు

విజయవాడలో ఎమ్మెల్యే ఏలూరి

అద్దంకి, పర్చూరు నుంచి భారీగా ఆహార పొట్లాలు, పాలప్యాకెట్లు

చనిపోయిన విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి రవికుమార్

సోలార్ లైట్ల పంపిణీ

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వరద బాధితులకు చేయూత కార్యక్రమాల్లో మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిమగ్నమయ్యారు. అంతేకాక వారు బాధ్యతలు వహిస్తున్న నియోజకవర్గాల నుంచి బాధితులకు ఆహార పొట్లాలు, పాల ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లతో పాటు ఇతరత్రా అవసరమైన ఆహార పదార్థాలను భారీగా సరఫరా చేస్తున్నారు. మంత్రి గొట్టిపాటి మూడు రోజుల నుంచి బాపట్లలోనే ఉంటూ ముంపునకు గురైన లంక గ్రామాల్లో రేయింబవళ్లు తిరుగుతూనే అద్దంకి నుంచి భారీగా విజయవాడకు ఆహార పొట్లాలు పంపించారు. అలాగే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజయవాడలోని కొన్ని వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు సహాయక చర్యల బాధ్యతలు తీసుకొని పనిచేస్తున్నారు.గడిచిన రెండు రోజుల్లోనే ఈ రెండు నియోజకవర్గాల నుంచి లక్షమందికి పైగా అవసరమైన ఆహారాన్ని విజయవాడ బాధితులకు సరఫరా చేశారు.

ముంపు గ్రామాల్లోనే రవికుమార్

రవికుమార్ సొంత బాపట్ల జిల్లాలోని బాపట్ల, రేపల్లె ప్రాంతాల్లో ఉన్న వరద, ముంపు, లంక గ్రామాల్లో సేవలందించే కార్యక్రమాల్లో ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు ఆయన అటు ముంపు గ్రామాల్లోను ఇటు పునరావాస కేంద్రాల్లోను పర్యటిస్తూ బాధితులకు అవసరమైన చేయూతనిస్తూ కనిపించారు. మంత్రి, రేపల్లె ఎమ్మెల్యే అయిన సత్యప్రసాద్‌తో పాటు బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలను కలుపుకొని ఆయన అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ముంపు గ్రామాల్లో ఎదురైన విద్యుత్ సమస్యలు దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక వెలుగు కోసం సోలార్ లైట్ల పంపిణీకి శ్రీకారం పలికారు. సోమ, మంగళవారాల్లో 1500 లైట్లు ఆయన తెప్పించి ఆయా ప్రాంతాలకు పంపారు.





విజయవాడ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి

ఉద్యోగి కుటుంబానికి అండగా

విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రమాదవశాస్తూ మృతి చెందిన కుటుంబానికి మంత్రి రవికుమార్ అండగా నిలిచారు. మాజీ మంత్రి దేవినేని ఉమా ద్వారా విషయం తెలుసుకున్న గొట్టిపాటి మృతి చెందిన ఉద్యోగి భార్యతో ఫోన్‌లో మాట్లాడి ఆమెకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాక సంస్థ ద్వారా వచ్చే సాధారణ ఆర్థిక చేయూతకు తోడు రూ.10 లక్షల తక్షణ సాయంగా అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఏలూరి సేవలు

సోమవారం నుంచి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వరద ప్రాంతాల్లో బాధితులను ఆదుకునే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సితార సెంటర్‌లో సేవా కార్యక్రమాల బాధ్యతలు చేపట్టిన ఆయన మూడు ప్రాంతాల బాధితుల కోసం ని యోజకవర్గం నుంచి భారీగా ఆహార పొట్లాలను అక్కడకు తెప్పించుకున్నారు. ఆయన సూచనలతో నియోజకవర్గానికి చెం దిన ఎన్‌ఆర్‌ఐలు, మరికొందరు నేతలు ముందుకు వచ్చి ఒక్కరోజులోనే 50వేల మందికి సరిపడా ఆహారాన్ని సిద్ధం చేశారు. మంచినీళ్ల బాటిల్స్ తెప్పించుకున్న ఏలూరి తాను బాధ్యతలు తీసుకున్న ప్రాంతంలో బాధితులకు అందజేస్తున్నారు.

దొడ్డవరం సొసైటీలో కుంభకోణం

అరకోటికిపైగా నిధులు స్వాహా

వంద రసీదుల పుస్తకాలు గల్లంతు

రుణ బకాయిలు, షేర్ ధనం స్వాహా

లాభాల నుంచి నష్టాల్లోకి పీఏసీఎస్

విచారణకు ఆదేశించిన డీసీవో

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 3 : మద్దిపాడు మండలం దొడ్డవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో భారీ కుంభకోణం జరిగింది. సొసైటీ నిధులు అరకోటికిపైగా స్వాహా చేశారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) కూకట్ల శ్రీవాణి నిర్వాకంతో లాభాల్లో నడుస్తున్న సొసైటీ నష్టాలబాట పట్టింది. అడ్డగోలుగా సొసైటీ నిధులు దిగమింగి సొసైటీని గుల్ల చేశారు. రైతుల నుంచి వసూలు చేసిన మొత్తాలకు సంబంధించి వంద రసీదులు ఉన్న పుస్తకాన్ని మాయం చేశారు. ఒకే నంబరు రసీదుతో ఇద్దరు ముగ్గురు రైతుల నుంచి డబ్బులు వసూలు చేసి కైంకర్యం చేశారు. రైతుల నుంచి వసూలు చేసిన రుణ బకాయిలు, షేర్ ధనాన్ని కూడా స్వాహా చేశారు. సొసైటీలో జరిగిన నిధులు దుర్వినియోగం, అక్రమాలు పీడీసీసీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్/సూపర్‌వైజర్లు వి.చంద్రశేఖర్, డి.రామారావుల త్రైమాసిక తనిఖీ నివేదికలతో వెలుగులోకి వచ్చాయి. ఈ నివేదికలను పరిశీలించిన బ్యాంకు సీఈవో కోటిరెడ్డి విచారణ జరపించాలని డీసీవోకు సిఫార్సు చేశారు. దీంతో డీసీవో సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా ఒంగోలు సబ్ డివిజనల్ సహకారాధికారి బీసీహెచ్ మాల కొండయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రెండు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదికను అందజేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.



దొడ్డవరం సొసైటీ కార్యాలయం

డబుల్ రసీదులతోనూ స్వాహా

సొసైటీ నిధులకు రక్షణకర్తగా ఉండాల్సిన సీఈవో అడ్డగోలుగా సొసైటీ సొమ్మును డబుల్ రసీదులతో స్వాహా చేశారు.

- కేవీఆర్‌పీ రుణాలకు సంబంధించి 2023 అక్టోబరు 11న 292400 నంబరు రసీదుతో పి. సాంబశివరావు నుంచి రూ.లక్ష వసూలు చేశారు. అదే నంబరు రసీదుతో 2023 సెప్టెంబరు 29న రూ.లక్ష వసూలు చేసి ఈ మొత్తం రూ.2లక్షలను సీఈఓ స్వాహా చేశారు.

-కేవీఆర్‌పీ రుణాలకు సంబంధించి 2023 మార్చి 23న 244984 నంబరు రసీదు పి.సాంబశివరావు నుంచి రూ.23,625, అదే రసీదుతో జి.వి.సుబ్బమ్మ నుంచి 2023 అక్టోబరు 11న రూ. 4,830 వసూలు చేసి ఆ మొత్తాన్ని దిగమింగారు.

-పి.సాంబశివరావు నుంచి 281731 రసీదు నెంబరుతో రూ.75,500, అదే నెంబరు రసీదుతో మద్రిపూడి హరిబాబు నుంచి కూడా డబ్బులు వసూలు చేసి మింగేశారు. ఈ విధంగా రెండు రసీదులు మెయింటైన్ చేసి రైతుల నుంచి వసూలు చేసిన ఆ మొత్తాలను సీఈవో స్వాహా చేశారు.

రశీదు పుస్తకం గల్లంతు

సొసైటీలో వంద రసీదులు ఉన్న పుస్తకం గల్లంతైంది. సొసైటీలో నగదు లావాదేవీలకు ఈ రసీదు పుస్తకమే ఆధారం. అది మాయమైపోవడంతో ఆ రసీదులతో ఎవరి నుంచి ఎంత మొత్తం వసూలు చేసింది తెలియకుండా పోయింది. రసీదు నెంబరు 106201 నుంచి 106300 వరకు ఉన్న పుస్తకం కనిపించడం లేదు. ఈ పుస్తకంలో నుంచి 106208 నెంబరు రసీదుతో పి.రాధా నుంచి రూ.11,060 వసూలు చేసి ఆ మొత్తాన్ని నగదు పుస్తకంలో నమోదు చేయకుండా దిగమింగారు.

అర కోటికిపైగా స్వాహా

సొసైటీ ద్వారా రైతులకు బట్వాడా చేసిన స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు, కిసాన్ వికాస రుణ పథకం, సొసైటీ సొంత నిధులతో ఇచ్చిన రుణాల్లో అక్రమాలు జరిగాయి. ఈ రుణాలకు సంబంధించి రైతుల నుంచి వసూలు చేసిన రూ.22.75 లక్షలను సీఈవో గోల్‌మాల్ చేశారు. రైతుల నుంచి వసూలు చేసిన డబ్బులను సొసైటీ రికార్డుల్లో, నగదు పుస్తకాల్లో నమోదు చేసి బ్యాంకులో జమచేయాల్సి ఉండగా, సొంతానికి వాడుకున్నారు. ఆ మొత్తం కనీసం అరకోటికిపైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తనిఖీలు లేనందునే స్వాహాలు

బ్యాంకు అధికారులు సొసైటీలను నిబంధనల ప్రకారం సందర్శిస్తూ తనిఖీ నివేదికలు సమర్పించనందునే నిధుల స్వాహాపర్వం యథేచ్ఛగా కొనసాగుతుంది. బ్యాంకు సూపర్‌వైజర్లు ప్రతి మూడు నెలలకు, మేనేజర్ కనీసం సంవత్సరానికి ఒకసారి, జోనల్ మేనేజర్లు ప్రతి ఆరు నెలలకు సొసైటీలను సందర్శించి లావాదేవీలను పరిశీలించి తప్పులు ఉంటే ప్రత్యేక నివేదిక ద్వారా బ్యాంకు సీఈవోకు సమర్పించాలి. అయితే అటువంటి పరిస్థితి లేకపోవడంతో సొసైటీల్లో నిధులు దుర్వినియోగం ఎక్కువైంది.

జిల్లాలో 62 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 3 : జిల్లాలో 62 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ జాబితాకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆమోదముద్ర వేశారు. ఈ నెల 5న ప్రకాశం భవన్‌లోని మీకోసం హాలులో జరిగే గురుపూజోత్సవ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేయనున్నారు. అవార్డులకు ఎంపికైన వారిలో పది మంది హైస్కూలు హెచ్‌ఎంలు, 20మంది స్కూలు అసిస్టెంట్లు, నలుగురు హైస్కూలు ప్లస్‌లో పనిచేస్తున్న పీజీటీలు, 25మంది సెకడరీ గ్రేడ్ టీచర్లు(తెలుగు), ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఉర్దూ) ఉన్నారు.

హెచ్‌ఎంల విభాగంలో... టి.ఎల్.కాంతారావు(బండ్లమూడి), డి.గురుస్వామి(అల్లీనగరం), ఎం.సుధాకర్ (తర్లుపాడు), డి.జయవరప్రసాద్(పి డికిటివారిపల్లి), జి.గురుప్రసాద్(చందలూరు), టి.బిక్షాలు(గార్లపేట), వై.శ్రీనివాసరావు(మొహిద్దీన్ పురం), కే.శ్రీనివాస్(మూలగుంటపాడు), షేక్ అమ్మద్(వైడిపాడు), ఎస్.గోపాలనాయక్(కాకర్ల)లు ఎన్నికయ్యారు.

- స్కూలు అసిస్టెంట్ విభాగంలో... కే.నరసింహారావు(దొనకొండ), కే.ప్రదీప్‌కుమార్(గజ్జలకొండ), షేక్ ఖాజామొహిద్దీన్(దిరిశవంచ), కే.సత్యనారాయణ(వైపాలెం), హెచ్.రాధా కృష్ణమూర్తి(ఆకవీడు), వి.మాలకొండయ్య(దొనకొండ, అర్ధవీడు), ఎన్.వెంకటరమణయ్య(శీలంవారిపల్లి), ఆర్ కొండానాయక్(ముటుకుల), పి.రామాంజనేయులు(ఈతముక్కల), బి.అంజనేయులు(మాచవరం), టి.రామారావు(చిన్నారికట్ల), వి.సి.వెంకటేశ్వర్లు(ఓబులక్కపల్లి), జి. ఈశ్వరమ్మ(పీసీపల్లి), కే.సుజాత(అల్లీనగరం), పి.రాచయ్య(ముక్తినూతలపాడు), టి.రతన్‌బాబు (చిన్నారికట్ల), టి.పద్మాగాయత్రి(నాగంపల్లి), పి.రాహేలమ్మ (మీర్జాపేట), పీఎంకే ఆత్రేయ(చిలకపాడు), ఎం.రవీంద్రప్రసాద్(మైనంపాడు)లు ఎంపికయ్యారు.

- పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ) విభాగంలో.. వి.శ్రీనివాసరావు(హెచ్.నిడమానూరు), పి మెర్సిన్‌బాబు (కరవది), సిహెచ్.మార్కండేయులు(కొణిజేడు), ఎం.నాగకుమారశర్మ (మైనంపాడు)లు ఎంపికయ్యారు.

- ఎస్జీటీ (తెలుగు) విభాగంలో: కే.వెంకటేశ్వరరావు(మార్కాపురం), కే.శ్రీనివాసులు(దోర్నాల), బి. శైలజ(చౌటపల్లి), కేవీ.శివనాగమణి(కురిచేడు), సిహెచ్.సునీతాదేవి (కోవిలంపాడు), కే. సుజాత(సిద్దవరం), బి.శ్రీదేవి(మంగమూరు), ఎం.భాస్కర్(అయ్యంబొట్లపల్లి),డి. అరుణ (అనుమలపల్లి), కే.మాల్యాద్రి(చెన్నుపాడు), ఆర్.తిరుపతయ్య(గన్నవరం), వి.శ్రీనివాసులురెడ్డి(ఊళ్లపాలెం), ఈ.సరోజనమ్మ (దర్శిగుంట్ల), ఆర్‌వి.శేషకుమారి(గురువారెడ్డిపాలెం), కే.శైలజ(దాసరివారిపాలెం), సీహెచ్.భాస్కర్(తురిమెళ్ల), జి.రత్నమ్మ(డీపీజీపేట), ఎ.పిచ్చమ్మ(మిట్టపాలెం), ఎస్‌కే.దస్తగిరి(పాలూరివారిపల్లి), ఎం.నరసారెడ్డి(వునుగోడు), పి సముద్రకుమారి(అయ్యపురాజుపాలెం), జి.సువార్త(రాచవారిపాలెం), కే.శివపార్వతి(ఒంగోలు), జి.రమాతులసి(పి.తక్కెళ్లపాడు), ఎం.రజిని(నందనవనం)లు ఎంపికయ్యారు.

సెకండరీ గ్రేడ్(ఉర్దూ) విభాగంలో: షేక్‌మల్లిక(ఫిర్‌దేస్‌నగర్), సయ్యద్ యాస్మిన్‌బాను(రావిపాడు), పఠాన్ జైనాబి(కనిగిరి)లు ఎంపికయ్యారు.

ముక్తేశ్వరంలో జోరుగా పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, సెప్టెంబరు 3 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో మంగళవారం నుంచి పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. అదుపులోకి రాని విష జ్వరాలు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బాజీ పర్యవేక్షణలో గ్రామంలో వీధుల వెంట కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దోమల నివారణకు ఫాగింగ్‌తోపాటు ఎబేట్‌ను పిచికారీ చేశారు. జ్వరాలు, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లపై మురుగు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. మరోపక్క వైద్య శిబిరంలో ఆరోగ్య సిబ్బంది సేవలందిస్తున్నారు. ముక్తేశ్వరం గ్రామాన్ని మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పంచాయతీ అధికారులతో మాట్లాడుతు వీధులు, కాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మరోసారి రోగాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు.

వణుకుతున్న మణికేశ్వరం

- ఇంటికి ఇద్దరికి విష జర్వాలు
- మంచంపట్టిన రోగులు
- మేదరమెట్ల, అద్దంకి పట్టణాలకు వెళ్లి చికిత్స
- పట్టించుకోని వైద్యాధికారులు


జ్వరంతో బాధపడుతున్న వృద్ధురాలు అంజమ్మ, నాగాంజమ్మ, నొప్పితో బాధపడుతున్న ఏసురత్నం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3 : మండలంలో మణికేశ్వరం విష జర్వాలతో వణుకుతోంది. 20 రోజులుగా గ్రామంలో ఇంటికి ఇద్దరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. అయినా వైద్యాధికారులు ఇటు తొంగిచూడడం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని తిప్పమిద గత 20రోజుల నుంచి విషజర్వాలబారిన పడి తీవ్రమైన ఒంటి నొప్పిలతో కొందరు మంచానికే పరిమితమయ్యారు. జ్వరాలు తగ్గినా కీళ్ల నొప్పితో నడవకలేక పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 50 మంది వరకు ఉన్నారని చెప్తున్నారు. వీరిలో కొందరు గ్రామంలోకి వచ్చే ఆర్ఎంపీతో వైద్యం చేయించుకోగా, మరికొందరు అద్దంకి, మేదరమెట్ల పట్టణాలలోని ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. వేలకు వేలు ఖర్చు చేస్తున్న జ్వరం తగ్గడంలేదని, రోజుల తరబడి ఇబ్బంది పడుతున్నామని పీడితులు వాపోతున్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. గ్రామంలో ఉన్న ఆరోగ్య సిబ్బంది కూడా విషజ్వరాల పరిస్థితిపై వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారని పలువురు రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక బాధితులు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. స్థోమత ఉన్న వారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందున్న పరిస్థితి ఉంది. తక్షణమే మణికేశ్వరంలో జిల్లా వైద్యాధికారులు పర్యటించాలని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరాలు తగ్గేవరకూ సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.


భవానీపురంలో వరద ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సహాయక చర్యల్లో ఎమ్మెల్యేలు

చీరాల, సెప్టెంబరు 3 : విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మంగళవారం బాధితులకు అందుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించారు. స్థానికులకు మనోధైర్యం కల్పించారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో ఎవరికీ ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కూడా ఉన్నారు. ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌ల చొరవతో వాడరేవు నుంచి విజయవాడకు తరలించిన ఐదు బోట్లు మంగళవారం సహాయక చర్యల్లో కొనసాగాయి.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ

బల్లికురవ, సెప్టెంబరు 3 : బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. మంగళవారం ఆటో డ్రైవర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ విజువల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ రోడ్లపై వాహనాలను నిలపకుండా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా సహకరించాలన్నారు. అలాగే ఆటోలను రోడ్లపై అడ్డదిడ్డంగా ఉంచకుండా వరుస క్రమంలో నిలపాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను ఉంచాలన్నారు. ప్రమాదాలు జరగకుండా పరిమిత మోతాదులోనే ప్రయాణికులను ఎక్కించాలన్నారు. ఆటోలకు త్వరలో సీరియల్ నెంబర్లను కేటాయిస్తామని, అందరూ పేర్లు, ఆధార్ వివరాలను అందించాలన్నారు. రోడ్లపై ఎక్కడికక్కడ వాహనాలను నిలపకుండా ప్రజలు సహకరించాలని ఎస్ఐ కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఏడుగురు జూదరుల అరెస్టు

బల్లికురవ, సెప్టెంబరు 3 : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి సిబ్బందితో కలిసి దాడి చేశారు. జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.7040ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్నవారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా పేక ముక్క ఆడినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

అద్దంకిలో ఆకతాయిల ఆగడాలు

- బెంబేలెత్తుతున్న ప్రజలు
- కట్టడి చేయాలని పోలీసులకు విజ్ఞప్తి

అద్దంకి, సెప్టెంబరు 3 : అద్దంకి పట్టణంలో ఇటీవల కాలంలో ఆకతాయిల ఆగడాలు మరింత పెరిగాయి. చీకటి పడితే ఖాళీ ప్రదేశాలను అడ్డాగా చేసుకుని మద్యం తాగుతున్నారు. ఇదే సమయంలో అటువైపు వెళ్లే ప్రజలను రన్నింగ్ కామెంటరీ చేయడం సర్వసాధారణంగా మారింది. ప్రధానంగా దర్శి రోడ్డులో మూడు అంతస్తుల భవనం పక్కన కట్టకిందపాలెం రోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న బల్లలపై యువకులు తిష్ట వేస్తున్నారు. పొద్దుపోయే వరకు అక్కడే ఉంటున్నారు. అనంతరం మోటార్ సైకిళ్లపై పట్టణంలో చక్కర్లు కొడుతున్నారు. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడికి దిగుతున్నారు. ఇటీవల భవానీ సెంటర్‌కు చెందిన ఆర్ఎంపీ ఆటు వైపు గా వెళ్తా యువకుల వికృత చేష్టలను ప్రశ్నించారు. దీంతో యువకులంతా తిరగపడి దాడి చేసేంత పని చేశారు. రోజూ ఈ ప్రాంతంలో ఇదే పరిస్థితి అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చీకటి పడితే మహిళలు, విద్యార్థినులు అటువైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. పలు శివారు ప్రాంతాలలో కూడా ఇటీవల యువకుల సిట్టింగ్‌లు మరింత పెరిగాయి. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఆకతాయిల ఆగడాలకు ముకుతాడు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలుర వసతి గృహంలో విద్యార్థుల ఇక్కట్లు


తలుపులు లేని గదులు, విరిగిన ఫ్యాన్లు

సంతమాగులూరు, సెప్టెంబరు 3 : సంతమాగులూరులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం అధ్వానంగా మారింది. ఈ వసతి గృహాన్ని 20ఏళ్ల కిందట నూతన భవనంలోకి మార్చారు. ప్రస్తుతం 40 మంది విద్యార్థులు దూరప్రాంతాల నుంచి వచ్చి ఉంటున్నారు. వసతి గృహంలో ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేకపోగా, కొన్ని విరిగిపోయాయి. విద్యార్థుల పడక గదుల తలుపులు, కిటికీలు ఊడిపోయాయి. విద్యుత్ స్విచ్ బోర్డులు పాడై వైర్లు వేలాడుతున్నాయి. సీలింగ్ ఫ్యాన్లు విరిగిపోయి మూలనపడ్డాయి. రెండేళ్లుగా బోరింగ్ మోటార్ మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన చేతి బోరింగు నీరే దిక్కయింది. వసతుల లేమితో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఈ వసతి గృహంలో వార్డెన్ మున్నంగి నాగేశ్వరరావు, కామాటిగా చెన్నుపల్లి కనకదుర్గ, ఔట్ సోర్సింగ్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న రవి, వంట మాస్టర్‌గా నాగరాజు పనిచేస్తున్నారు. వంట మాస్టర్ నాగరాజు ఇటీవల పనిలో లేరు. వాచ్‌మన్ రవే వంట చేస్తున్నారు. వసతిగృహంలోని సమస్యలను పై అధికారులకు తెలియజేసినా స్పందించడం లేదని విద్యార్థులు, సిబ్బంది అంటున్నారు. ఇప్పటికైనా వసతి గృహ సమస్యలపై అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న భారీ ప్రతిమలు

గణనాథుల విగ్రహాలు సిద్ధం

ఇంకొల్లు, సెప్టెంబరు 3 : వినాయకచవితి పండుగకు ఇంకొల్లులో వినాయక విగ్రహాలు అమ్మకానికి సిద్ధమవుతున్నాయి. ఈనెల 7వ తేదీన జరిగే పండుగకు వివిధ రూపాలలో ఉన్న గణనాథుల విగ్రహాలు కొలువుదీరనున్నాయి. పలు ఆకృతులు, రంగురంగులతో బొజ్జ గణపయ్య ప్రతిమలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో చవితి నిర్వాహకులు ముందుగానే పెద్ద బొమ్మలకు ఆర్డర్‌లు ఇచ్చారు. సుమారు 80 భారీ విగ్రహాలకు ఆర్డర్లు వచ్చినట్లు తయారీదారులు చెప్తున్నారు.

వానొస్తే అండర్‌పాస్‌లో సమస్య

- రాకపోకలకు ఇబ్బందులు
- గ్రామస్థుల ఆవేదన


వర్షపు నీటితో ఇబ్బంది పడుతున్న ద్విచక్రవాహదారులు

చినగంజాం, సెప్టెంబరు 3 : వానొస్తే రైల్వే అండర్ పాస్ వద్ద సమస్యలు తలెత్తుతున్నాయి. ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ సమీపంలోని ఉత్తర గేటు వద్ద నూతనగా నిర్మించిన రైల్వే అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలవడంతో ప్రయాణించడం పెద్ద సమస్యగా మారిందని పెదగంజాం గ్రామస్థులు ఆవేదన వెల్లబుచ్చుతున్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పెదగంజాం, ఎస్టీకాలని, బుచ్చిగుంట, పల్లెపాలెం, ఆవులదొడ్డిపాతగొల్లపాలెం, ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం, కాటంవారిపాలెం, కోడూరివారిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం పనుల నిమిత్తం ఈ అండర్‌పాస్ ద్వారానే బంగోలు, ఉప్పుగుండూరు తదితర గ్రామాలకు ప్రయాణిస్తూ ఉంటారు. అండర్‌పాస్‌లో విద్యుత్ లైట్లు లేకపోడం, వర్షపు నీరు నిలబడటం వలన ప్రయాణం నరకయాతనగా ఉందని గ్రామస్థులు అంటున్నారు. రహదారి సైతం దెబ్బతినడంతో ప్రాణాలు బిగబెట్టుకొని ప్రయాణించవలసి వస్తుందని వాహనచోదకులు తెలిపారు. అండర్‌పాస్‌లో ప్రయాణించేటప్పుడు ద్విచక్రవాహదారులు అదుపు తప్పి గాయాల పాలవుతున్నారు. అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపునీటిలో ప్రయాణించడం వలన ద్విచక్ర వాహనాల్లోని ఇంజన్‌లోనికి వర్షపు నీరు చేరి వాహనాలు ఆగిపోవడం వలన గమ్యస్థానాలకు చేరాలంటే ఇబ్బందులు పడవలసి వస్తుందని ద్విచక్రవాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024 ఫిబ్రవరి 26వ తేదీన జరిగిన రైల్వే అండర్ పాస్ ప్రారంభోత్సవ సభలో అండర్‌పాస్‌ని ఆర్‌వీఎన్ఎల్ వారు రైల్వే వారికి అప్పగిస్తే, వర్షపునీరు నిలబడ కుండా సెన్సార్ మెటార్లు ఏర్పాటు చేస్తామని, వాహనచోదకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగవని బాపట్ల ఏడీఈఎన్ హామీ ఇచ్చినట్లల గ్రామస్థులు తెలిపారు. హామీ ఇచ్చి ఆరు నెలలైనా చర్యలు లేవన్నారు. రైల్వే అండర్‌పాస్‌లో మెటార్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని రైల్వే అధికారులను పెదగంజాం గ్రామస్థులు కోరుతున్నారు.

రాత్రి ప్రయాణం భయమే - కిలారి వెంకటరావు, పెదగంజాం

పగలు ఏదో ఒక విధంగా వెళ్తున్నప్పటికీ రాత్రి వేళ ప్రయాణించాలంటే భయంగా ఉంది. రైల్వే ఉన్నాతాధికారులు స్పందించి అండర్‌పాస్‌లో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలలి. వర్షపునీరు నిల్వలేకుండా చేయాలి. అండర్‌పాస్‌లో నిలిచిన నీటిలో ప్రయాణించేటప్పుడు దిచక్రవాహనాల్లోని ఇంజన్‌లోనికి నీరు చేరి వాహనాలు ఆగిపోయి ఇబ్బంది పడుతున్నారు.

వరద బాధితులకు భోజనాలు

- మంత్రి గొట్టిపాటి సహకారంతో అద్దంకి నుంచి 40వేల మందికి ఆహారం
- విజవాయడకు తరలిన వాహనాలు

అద్దంకి, సెప్టెంబరు 3 : వరద బాధితుల ఆకలి తీర్చేందుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నడుంబిగించారు. అద్దంకిలో భోజనాలను తయారు చేయించి ప్యాకింగ్ చేసి వాహనాలలో విజయవాడకు పంపారు. పట్టణంలోని నాగులపాడు రోడ్డులో కామేపల్లి కల్యాణ మండపంలో సోమవారం, మంగళవారం సుమారు 65వేల మందికి భోజనాలు తయారు చేయించి పంపారు. సోమవారం రాత్రి 25వేల మందికి పంపగా, మంగళవారం ఉదయం 20వేల మందికి, సాయంత్రం మరో 20వేల మందికి ఆహార ప్యాకెట్లను తయారు చేయించి విజయవాడకు పంపించారు. పలువురు టీడీపీ నేతలు నిత్యం పర్యవేక్షిస్తూ భోజనాలు తయారు చేయిస్తున్నారు.


వరదబాధితుల కోసం సిద్ధం చేస్తున్న ఆహర ప్యాకెట్లు


తెలుగుయువత పంపుతున్న వాటర్ బాటిళ్లు

తెలుగుయువత ఆధ్వర్యంలో వాటర్‌బాటిళ్లు

అద్దంకి, సెప్టెంబరు 3 : వరదబాధితుల కోసం తెలుగుయువత ఆధ్వర్యంలో మంగళవారం వాటర్‌బాటిళ్లను విజయవాడకు పంపారు. విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు మేరకు అద్దంకి మండలంలోని నాగులపాడు తెలుగు యువత, వీవీఆర్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో విప్పర్ల పవన్‌కుమార్, వడ్లమూడి జానకి రామయ్య, కొల్లి సాంబయ్య 10వేల వాటర్‌బాటిళ్లను రెండు ట్రాలీ ఆటోలలో విజయవాడకు పంపారు.

ఏలూరి అండ

- 45వేల మందికి ఆహార పొట్లాలు, నీళ్ల బాటిళ్లు
- క్యాంప్ కార్యాలయం నుంచి తరలించిన టీడీపీ శ్రేణులు
- అక్కడే ఉండి బాధితులకు ధైర్యం నింపుతున్న ఎమ్మెల్యే


ఆహర పొట్లాలతో బయలుదేరిన వాహనాలు

మార్టూరు, సెప్టెంబరు 3 : ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం మధ్యాహ్నం 45వేల మందికి సరిపడా ఆహారప్యాకెట్లను విజయవాడ వరదబాధితులకు పంపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు దగ్గరుండి ఆహారాన్ని వాహనాలల్లో తరలించారు. విజయవాడలో వరదముంపు ప్రాంతాలను పర్యవేక్షించాల్సిందిగా ఎమ్మెల్యే ఏలూరికి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. దీంతో ఏలూరి అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. మరోపక్క క్యాంప్ కార్యాలయం నుంచి భోజనం ప్యాకెట్లు తీసుకోవాలని స్థానిక నేతలకు ఏలూరి సూచించడంతో మంగళవారం పెద్ద ఎత్తున ఆహార ప్యాకెట్లను విజయవాడకు తీసుకెళ్లారు. నాయకులు, అనుచరులు, ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు స్వయంగా ఏలూరి ఆదేశాలను పాటిసూ ప్రత్యేక సిబ్బందితో ఆహారపొట్లాలను సిద్ధం చేశారు. తెలుగుయువత సహకారంతో డబ్బాల్లో, ప్యాకెట్లలో ఆహారాన్ని నింపారు. అలాగే పెద్ద ఎత్తున నీళ్ల బాటిళ్లను సాయంత్రం విజయవాడకు పంపించారు. ఎమ్మెల్యే పిలుపుతో విజయవాడ వరద బాధితులకు సహాయక చర్యలు అందించేందుకు ఏలూరి సేన సిద్ధమయ్యారు.


అద్దంకిలోని గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న నాయకులు

గురుకుల పాఠశాల పరిశీలన

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3 : అద్దంకిలోని గిరిజన గురుకుల పాఠశాలను మంగళవారం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యువజన సంఘం బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థి గదులను, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మంచి భోజనం తయారు చేసి శుభ్రమైన వాతావరణంలో పిల్లలకు పెట్టాలని సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కా కాంతారావు కోరారు. కార్యక్రమంలో సభ్యులు పులిపాటి హేబేలు, వీరయ్య, సతీష్, బాబు, జోసి పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అదికారులు

టీచర్లకు సర్దుబాటు కౌన్సెలింగ్

పంగులూరు, సెప్టెంబరు 3 : పంగులూరులో మంగళవారం టీచర్లకు సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మిగులుగా ఉన్న ఎస్‌జీటీని బూదవాడ మెయిన్ పాఠశాలకు, నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అదనంగా ఉన్న ఎస్‌జీటీలు ఇద్దరిని కశ్యాపురానికి, అలాగే ప్రాథమిక పాఠశాలకు ఒకరిని సర్దుబాటు చేయగా, బైటమంజులూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మిగులుగా ఉన్న వారిని కొండమంజులూరు ప్రాథమిక పాఠశాలకు సర్దుబాటు చేశారు. తూర్పు కొప్పెరపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి పంగులూరు మెయిన్‌కు సర్దుబాటు చేసినట్లు ఎంఈవో నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వీరాంజనేయులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అటు దుర్గంధం.. ఇటు దోమలు

- వసతుల లేమితో గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులు

పర్చూరు, సెప్టెంబరు 3 : చాలీచాలని ఇరుకు గదులు.. అరకొర వసతులు.., వసతి గృహం చుట్టూ దుర్గంధం.., దోమలబెడద.. వెరసి సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పర్చూరులోని గిరిజన సాంఘిక సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కనీసం విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు కూడా లేకపోవటం, ఉన్న అరకొరగా ఉండటంతో విద్యార్థులు నానా ఇక్కట్లు పడుతున్నారు. పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు ఎస్సీ బాలికల వసతి గృహం పరిస్థితి ఇదే విధంగా ఉంది. వసతి గృహం చుట్టూ మురుగునీరు, చిల్లచెట్లు ఉండటంతో దోమలతో వారు అల్లాడుతున్నారు. అలాగే నాగులపాలెం బాలయోగి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ప్రాంగణంలో మురుగునీరు ముందుకు కదలని దుస్థితి ఉంది. మరో పక్క ప్రాంగణంలో చిల్లచెట్లు, నాచుపేరుకు పోవటంతో సమస్య మరింత తీవ్రతరంగా మారింది.


గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ వసతి గృహం

రోజు రోజుకు పెరుగుతున్న జ్వరపీడితులు

ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో దోమల బెడదతో రోజు రోజుకు జ్వరపీడితులు పెరుగుతుండంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. పారిశుధ్య సమస్య దోమలతో ఎలాంటి ప్రాంణాంతకర వ్యాధులు వ్యాప్తి చెందుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం అయినందున వైరల్ ఫీవర్స్‌తోపాటు, టైఫాయిడ్, డెంగ్యూ, చికున్ గున్యా ప్రభలుతున్న తరుణంలో వారిలో మరింత ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంక్షేమ వసతి గృహాల ప్రాంగణాల్లో మురుగునీరు నిల్వలేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాఠశాల వద్ద నిల్వ ఉన్న మురుగు నీరు